


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 08-08-2025 | సంపుటి - 24 | సంచిక - 94 | రూ : 4 | పేజీలు : 8




2లో

## యూరియా బస్తాలు ఏమైపోతున్నాయి?

- భారీగా అమ్మకాలు పెరగడంపై సంశయం

అమరావతి: ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో 43శాతం మేరే పంటలు వేశారని వ్యవసాయశాఖ అంచనా.. ఈపంట లెక్కలు చూస్తే ఇది ఇంకా తక్కువే. అయినా గత ఐదేళ్లతో

తరువాయి 2లో

# ఇది తెలంగాణ ప్రజలను అవమానించడమే



- రాష్ట్రపతి అపాయింట్‌మెంట్‌ను.. మోదీ, అమిత్‌షాలే అడ్డుకున్నారు
- ఇతర రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు ఇచ్చి.. ఆ పేరుతో తెలంగాణ బిల్లులను ఆపారు..
- ఆ పార్టీ ధోరణికి ప్రజలు బుద్ధి చెబుతారు..
- సీఎం రేవంత్‌రెడ్డి మండిపాటు
- కేసీఆర్ బందీగానే ఉన్నారు.. జైలు అవసరం లేదని వ్యాఖ్య

2లో



## చేనేత రంగం పూర్వవైభవానికి కృషి : మంత్రి తుమ్మల

హైదరాబాద్: చేనేత రంగానికి పూర్వవైభవాన్ని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఆయన

తరువాయి 2లో

# ఢీ అంటే.. ఢీ...

- అమెరికా సుంకాలపై దీటుగా స్పందించిన భారత్
- రైతుల ప్రయోజనాలే ముఖ్యమన్న మోదీ
- భారాన్ని భరిస్తామని స్పష్టీకరణ
- మరిన్ని ఆంక్షలకు సిద్ధమన్న ట్రంప్
- అమల్లోకి వచ్చిన 25% సుంకాలు
- అమెరికాలో పెరగనున్న ధరలు






2లో




2లో

## గ్రీన్ కార్డు నిరీక్షణకు తెరదించనున్న అమెరికా

### ప్రతిపాదనలతో కొత్త బిల్లు!

- ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు ప్రతిపాదించిన సర్కారు
- 20 వేల డాలర్లు చెల్లిస్తే గ్రీన్ కార్డు దరఖాస్తును వేగంగా పరిశీలిస్తామని వెల్లడి
- గ్రీన్ కార్డు దరఖాస్తుల్లో బ్యాక్ లాగ్ క్లియర్ చేయడమే లక్ష్యమని వివరణ



## చతుర్విధ సాగుతో సత్ఫలితం..

- స్వామినాథన్ శత జయంతి సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

దిల్లీ: భారత వ్యవసాయ రంగంలో చతుర్విధ లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పోషకాహార భద్రత, పంటల్లో భిన్నత్వం, వాతావరణాన్ని తట్టుకునే పంటలు, టెక్నాలజీలు ఈ నాలుగు లక్ష్యాలని పేర్కొన్నారు. హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా గురువారం దిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా

తరువాయి 2లో



## రెండు లక్షల పింఛన్లు తొలగించిన ప్రభుత్వం

- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

'ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆసరా పింఛన్‌ను రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ కొత్త పింఛన్ల మంజూరు దేవుడెరుగు.. ఉన్న వాటిల్లో రెండు లక్షల పింఛన్లను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించింది' అని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సంపూర్ణ రుణమాఫీ చేయాలని, సన్నధాన్యానికి బోనస్ చెల్లించాలని, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెదక్‌లో గురువారం భారత

తరువాయి 2లో

## నేతన్నకు ఏటా రూ.25,000

### ఈ నెల నుంచే మగ్గాలకు ఉచిత విద్యుత్తు

- రూ.74 కోట్లతో చేనేత క్లస్టర్లు
- అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం
- జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వరాలు



2లో

# డీ అంటే డీ

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ విషయంలో రెండు దేశాలు డీ అంటే డీ అంటున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి.

**ఆందోళన తాత్కాలికమేనా..?**

అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడ్డాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్ అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయి' అని ఆయన పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు.

**భారత్ ఎప్పటికీ రాజీపడదు: మోదీ**

ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా గురువారం దిల్లీలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. 'రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం' అని ప్రధాని స్పష్టం చేశారు.

**మరిన్ని చూడబోతున్నారు: ట్రంప్**

రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారు' అని పేర్కొన్నారు.

## రెండు లక్షల పింఛన్లు
# తొలగించిన ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

అని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సంపూర్ణ రుణమాఫీ చేయాలని, సన్నధాన్యానికి బోనస్ చెల్లించాలని, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెదక్‌లో గురువారం భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు మహాధర్నాకు వెళుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక, నర్సాపూర్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి ఇందులో పాల్గొన్నారు. గతంలో భారత రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చాక రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలకు పెంచిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ''ఎన్నికల సందర్భంగా ప్రజలకు హామీ ఇవ్వకున్నా, మ్యానిఫెస్టోలో లేకున్నా అప్పటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేసి, పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని మాట ఇచ్చి, తప్పింది. మేడిగడ్డను పడావు పెట్టి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణగా సీఎం రేవంత్‌రెడ్డి, గోదావరి జలాలను బనకచర్లకు తరలిస్తున్నారు. కన్నెపల్లి పంపులను ఎప్పుడు ఆన్‌చేసినా రాష్ట్రంలోని చాలా ప్రాజెక్టులు నిండుతాయి. నర్సాపూర్ వరకూ గోదావరి నీరు చేరుతుంది. గోదావరి జలాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ, లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటిపై దృష్టి సారించడం లేదు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లులు ఇవ్వకుండా, వారు ధర్నా చేస్తే కేసులు పెట్టడం దారుణం. రెండేళ్లలో ప్రభుత్వ వసతిగృహాలకు కోడిగుడ్ల సరఫరాకు టెండరు నిర్వహించకుండా, కమీషన్ల కోసం పెండింగ్‌లో పెడుతూ వస్తున్నారు. రేవంత్‌రెడ్డి మూటలు మోసేందుకు దిల్లీ వెళుతున్నారు తప్పితే, పరిపాలన మీద దృష్టితో కాదు. కమీషన్ల పేరుతో కాలయాపన చేయడం, మీడియాకు లీకులు ఇవ్వడం, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం తప్పితే, ప్రభుత్వం చేసిందేమీ లేదు. భారత రాష్ట్ర సమితి హయాంలో కట్టిన ఫ్లైఓవర్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మించకున్నా అవి పూర్తయినట్లుగా హోర్డింగ్‌లు పెట్టారు. వసతిగృహాల నిర్వహణకు బిల్లులు ఇవ్వకుండా ఏసీబీ అధికారులతో తనిఖీలు చేయించడం సరికాదు. రెండేళ్లలో కేసీఆర్‌ను తిట్టడం తప్పితే చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే రేవంత్‌రెడ్డిని విమర్శిస్తున్నారు'' అని అన్నారు.

## చతుర్విధ సాగుతో సత్ఫలితం...

(మొదటిపేజీ తరువాయి)

స్వామినాథన్‌కు నివాళిగా ప్రత్యేక నాణేన్ని, పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. అనంతరం ప్రసంగించారు. 'వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధను, మెషీన్ లెర్నింగ్‌ను ఉపయోగించుకుని కరవును, వేడిని, వరదలను తట్టుకునే పంటలను అభివృద్ధి చేయాలి. రియల్ టైమ్‌లో నిర్ణయాలు తీసుకునే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. దీనిని ప్రతి జిల్లాలో అందుబాటులోకి తేవాలి. తద్వారా పంటల దిగుబడిని, తెగుళ్ల నివారణను, సాగు విధానాలను పర్యవేక్షించాలి. పంటల మార్పిడిపై పరిశోధనలు జరగాలి. భూములకు సరిపడే పంటలను నిర్ణయించాలి. సౌర విద్యుత్తు ఆధారిత మైక్రో ఇరిగేషన్ వ్యవస్థలను అభివృద్ధి చేయాలి' అని మోదీ పిలుపునిచ్చారు. దేశ వ్యవసాయ రంగానికి దివంగత స్వామినాథన్ చేసిన కృషిని ప్రధాని కొనియాడారు. ఆయన మన దేశానికి ఓ రత్నం లాంటి వారని పేర్కొన్నారు. 'ఎంఎస్ స్వామినాథన్ భారత మాతకు నిజమైన పుత్రుడు. ఆయన విజ్ఞానాన్ని ప్రజా సేవకు మాధ్యమంగా మార్చారు. దేశ ఆహార భద్రతను తన జీవిత లక్ష్యంగా చేసుకున్నారు. ఆయన ఆలోచనలు నేటి వ్యవసాయ రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

## గ్రీన్ కార్డు నిరీక్షణకు
# తెరదించనున్న అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

అమెరికాలో గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని సంవత్సరాలుగా వేచి చూస్తున్న వారికి ఊరట కల్పించేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. నిర్ణీత మొత్తం చెల్లిస్తే దరఖాస్తును త్వరగా పరిశీలించే అవకాశం తీసుకురానుంది. ఇందుకు అనుగుణంగా పలు ప్రతిపాదనలతో బిల్లును సిద్ధం చేసిన ప్రభుత్వం.. త్వరలో చట్టసభల్లో ప్రవేశపెట్టనుంది. అమెరికాలో తాత్కాలిక వీసాలపై ఉంటున్న భారతీయులతో పాటు చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ పౌరులు గ్రీన్ కార్డు కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఆయా దేశాల నుంచి పెద్ద సంఖ్యలో వలసలు, ఏటా నిర్ణయించే కోటా తదితర కారణాలతో ఈ ఆలస్యం జరుగుతోంది.

# ఇది తెలంగాణ ప్రజలను అవమానించడమే

బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న తమకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు అడ్డుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఇది తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు. బీసీల 42% రిజర్వేషన్ల బిల్లుపై బుధవారం జంతర్‌మంతర్‌లో ధర్నా చేపట్టిన ఆయన.. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం గురువారం సాయంత్రం వరకు ఎదురుచూశారు. రాకపోవడంతో సీఎం ఇక్కడి తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ''మేం రాష్ట్రపతిని అపాయింట్‌మెంట్ అడిగిన తర్వాత మోదీ, అమిత్‌షా రాష్ట్రపతిని కలిశారు. రాష్ట్రపతి మాకు అపాయింట్‌మెంట్ ఇస్తే రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది కాబట్టి.. మాకు ఆ అవకాశం రాకుండా వారిద్దరూ అడ్డుకున్నట్లు పీసీసీ అధ్యక్షుడు, మా మంత్రివర్గ సహచరులు నిర్ధారణకు వచ్చారు. మూడు రోజులుగా తెలంగాణ మంత్రివర్గమంతా దిల్లీలోనే ఉండి రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూసినా దొరకలేదు. బలహీనవర్గాల హక్కులను కాలరాయడానికి భాజపా ఆది నుంచీ కుట్రలు చేస్తూనే ఉంది. నాడు రథయాత్ర పేరుతో దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు సృష్టించి, మండల్ కమిషన్ సిఫార్సులు అమలు కాకుండా అడ్డుకుంది. తర్వాత సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్‌ల నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఐఐటీ, ఐఐఎం, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో బీసీ రిజర్వేషన్లకు నిర్ణయించినప్పుడు కూడా యూత్ ఫర్ ఈక్వాలిటీ పేరిట అడ్డుకోవడానికి భాజపా ప్రయత్నించింది. కానీ సోనియా, మన్మోహన్‌సింగ్‌లు పట్టుదలతో వాటిని అమలు చేసి చూపారు. ఇప్పుడు మేం బీసీల 42% రిజర్వేషన్లకు సిద్ధమైతే భాజపా మరోసారి అడ్డుకుంటోంది.



**మా బిల్లుల్లో మత ఆధారిత రిజర్వేషన్లు లేవు**

మేం చేసిన బిల్లులో లోపాలుంటే ఓబీసీ రిజర్వేషన్లపై భాజపా విధానమేంటో చెప్పాలి. మీ ఆలోచన ప్రకారమే పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతున్నా. ముస్లింలకు 10% రిజర్వేషన్లు ఏ బిల్లులో ప్రతిపాదించామో చూపాలని కిషన్‌రెడ్డిని సవాల్ చేస్తున్నా. కేంద్రమంత్రిగా ఉండి గల్లీ నాయకుడిలా మాట్లాడటం భావ్యం కాదు. మా రిజర్వేషన్ బిల్లులో మతం ఆధారంగా రిజర్వేషన్లు లేవు. స్థానిక సంస్థల్లో మొత్తం బీసీలకు కలిపి 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పాం తప్ప.. అందులో ఉపకులాలు లేవు. కానీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బిల్లులు చదివారో, చదవకుండానే మాట్లాడుతున్నారో తెలియదు. బిల్లులో ఏయే కులాలున్నాయో కిషన్‌రెడ్డికి అధికారికంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తాం. కావాలంటే కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖ మంత్రిని కూడా ఆహ్వానిస్తాం. లేదా యంత్రాంగాన్నంతా దిల్లీకి తీసుకొచ్చి కిషన్‌రెడ్డి అనుమానాలు తీరుస్తాం. ముస్లింలను తొలగించి బీసీలకు 42% బీసీ రిజర్వేషన్లు ఇస్తామని పార్లమెంటులో బిల్లుపెట్టి పాస్ చేయించాలని కిషన్‌రెడ్డిని డిమాండ్ చేస్తున్నా.

**భారత రాష్ట్ర సమితి శిఖండి పాత్ర**

2017లో రాజస్థాన్ నుంచి అబ్దుల్‌సత్తార్ అనే ముస్లిం ఓబీసీ రిజర్వేషన్ల ఆధారంగా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 1971 నుంచి నూర్‌బాషా, దూదేకుల లాంటి ముస్లింలకు మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో చట్టప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చినట్లు నరేంద్రమోదీయే స్వయంగా పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. కానీ అదే ముస్లింల పేరు చెప్పి భాజపా తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోంది. బీసీ రిజర్వేషన్ల విషయంలో భారత రాష్ట్ర సమితి శిఖండి పాత్ర పోషిస్తోంది. కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికి.. భాజపాతో అంటకాగడానికి ఆ పార్టీ సిద్ధమైంది. అందుకే భాజపా తప్పులను ప్రశ్నించడం కానీ, మా ధర్నాలో పాల్గొనడం కానీ చేయలేదు. పైగా మమ్మల్ని అవహేళన చేస్తోంది. అందుకే తెలంగాణ సమాజం ఆ రెండు పార్టీలను బీసీ ద్రోహులుగా భావిస్తోంది.

**పీఏసీలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ**

రిజర్వేషన్ల భవిష్యత్తు కార్యాచరణపై రాజకీయ సలహా కమిటీ (పీఏసీ)లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కేంద్ర ప్రభుత్వంపై న్యాయపరంగా, ప్రజాపోరాటాల ద్వారా ఎలా ఒత్తిడి తీసుకురావాలో చర్చిస్తాం. 42% రిజర్వేషన్లకు ఇంకా ఆమోదం రాలేదు కాబట్టి స్థానిక ఎన్నికల్లో వాటిని పార్టీపరంగా అమలు చేయడంపైనా చర్చించి నిర్ణయానికి వస్తాం. గవర్నర్లు, రాష్ట్రపతి తమవద్దకు వచ్చిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా.. మళ్లీ ఆ అంశాన్ని రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు రిఫర్ చేశారు. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు దానిపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు కోరింది. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని కోర్టుకు తెలియజేస్తాం.

**రాష్ట్రంలో మళ్లీ గెలిచి చూపుతాం**

2028లో మళ్లీ మేం తెలంగాణలో గెలవడం ఖాయం. 2029 ఎన్నికల్లో భాజపాను ఓడించి కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమూ ఖాయం. రాహుల్‌గాంధీ, ఖర్గే బుధవారం నాటి ధర్నాకు రాలేదని కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారు. వారు గతంలో ఇందిరాభవన్‌లో, తాల్కటోరా స్టేడియంలో జరిగిన సదస్సులకు హాజరై తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కాకపోతే కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఓబీసీ రిజర్వేషన్ల పెంపును అమలు చేసి చూపుతాం. రాహుల్ ఆలోచనలకు అడ్డొచ్చేవారందరినీ పక్కకు తోసేసి ముందుకు వెళ్తాం'' అని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. విలేకరుల సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

# నేతన్నకు ఏటా రూ.25,000

అమరావతి: 'నేతన్న భరోసా' పథకం కింద చేనేతలకు ఏటా రూ.25 వేలు ఆర్థికసాయం అందించబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ఈ నెల నుంచే అమల్లోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. దీనికి ఏడాదికి రూ.193 కోట్లు వ్యయమవుతుందని వివరించారు. చేనేత వస్త్రాలపై చెల్లించాల్సిన 5 శాతం జీఎస్టీని ప్రభుత్వమే రీయింబర్స్ చేస్తుందని.. ఇందుకోసం రూ.15 కోట్లు విడుదల చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిలిపేసిన త్రిఫ్ట్ ఫండ్‌ను అమల్లోకి తెస్తూ 5,386 మందికి రూ.5 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. చేనేతల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తామని ప్రకటించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. 'చరిత్రలో ఎన్నడూ చూడని సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. అభివృద్ధిని పట్టాలెక్కించి, సంక్షేమానికి రాజమార్గం వేశాం. రాజధాని అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం. వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, శ్రీకాళహస్తి, రాజాంలలో రూ.74 కోట్లతో క్లస్టర్లను అందుబాటులోకి తీసుకొస్తాం. ఇక్కడ 1,374 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. మంగళగిరిలో అమలవుతున్న వీవర్స్‌శాల వినూత్న కార్యక్రమం. బయటతో పోలిస్తే ఇక్కడ నేతన్నలకు 30 శాతం ఎక్కువ ఆదాయం వస్తోంది. వీటిని రాష్ట్రమంతా అందుబాటులోకి తీసుకొస్తాం. ఓఎన్‌డీసీ కింద చేనేత ఉత్పత్తులను విస్తరిస్తున్నాం.

**ఆదరణ-3 కింద ఆధునిక మగ్గాలు**

ఆదరణ3 పథకం కింద చేనేతలకు ఆధునిక మగ్గాలు అందిస్తాం. బీసీలు మూడు కిలోవాట్ల సోలార్ ప్యానల్స్ ఇంటిపై ఏర్పాటు చేసుకుంటే రూ.98 వేలు రాయితీ అందిస్తాం. వీటిని ఏర్పాటు చేసుకున్న చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయడంతోపాటు వారు ఉత్పత్తి చేసిన విద్యుత్తుకు డబ్బు చెల్లిస్తాం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. చేనేతల అభివృద్ధికి పారిశ్రామికవేత్త సుచిత్ర ఎల్లను సలహాదారుగా నియమించాం. ఈ రంగం అభివృద్ధికి టాటా, బిర్లా తరహా భారీ కంపెనీలు ముందుకొస్తున్నాయి. దేశంలో బెస్ట్ డిజైనర్లందరినీ ఎంప్యానల్ చేయాలని అధికారులను ఆదేశించా. చేనేత వస్త్రాలు ఏ ఊళ్లో ఎప్పుడు నేశారు... నేతన్న పడుతున్న కష్టం తెలిస్తే అధిక ధర వెచ్చించి అయినా వినియోగదారులు కొనుగోలు చేస్తారు. ఇందుకోసం ఆ ఉత్పత్తులకు ట్రేసబులిటీ ప్రవేశపెడతాం.

* **బార్లలోనూ గీత కార్మికులకు 10 శాతం రిజర్వ్**

'బీసీల వల్లనే అధికారంలో ఉన్నాం. తెదేపా పెట్టినప్పటి నుంచి బలపరిచిన ఏకైక వర్గం వెనుకబడిన తరగతులే. వైకాపా ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకున్న 34% రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించింది. దీనిపై న్యాయం చేస్తాం. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పనకు పోరాటం చేస్తాం. ఐదేళ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం. గీత కార్మికులకు 10% మద్యం దుకాణాలు కేటాయించాం. బార్లలోనూ 10% రిజర్వ్ చేస్తాం. సీవీడ్ ఉత్పత్తిలో మత్స్యకార మహిళల్ని భాగస్వాములను చేస్తాం. 10 శాతం క్వారీలను వడ్డెరలకు కేటాయిస్తాం. యాదవులు, కురబలకు గత తెదేపా ప్రభుత్వంలో ఉన్న పథకాలను మళ్లీ అమల్లోకి తీసుకొస్తాం' అని చంద్రబాబు ప్రకటించారు.

# చేనేత రంగం పూర్వవైభవానికి కృషి: మంత్రి తుమ్మల

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్ని ప్రసంగించారు. ''చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. మగ్గాల జియో ట్యాగింగ్‌లో ముందున్నాం. కార్మికుల సంక్షేమానికి నేతన్న పొదుపు, భద్రత, భరోసా పథకాలు అమలు చేస్తున్నాం. చేనేత రుణమాఫీ కోసం రూ.33 కోట్లు విడుదల చేశాం. ప్రభుత్వ శాఖల ఉత్పత్తులను టెస్కో ఆర్డర్ల ద్వారా తయారు చేయిస్తున్నాం. దసరా నాటికి రాష్ట్రంలో 65 లక్షల మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉచిత చీరలను పంపిణీ చేస్తాం'' అని తుమ్మల పేర్కొన్నారు. ఈ సందర్భంగా త్రిలింగ పట్టు చీరలను, తెలంగాణ అథెంటిక్ వీవ్స్ లోగోను ఆయన ఆవిష్కరించారు. అనంతరం 33 మంది చేనేత కార్మికులు, డిజైనర్లకు కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాలను అందజేశారు. శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, ఆప్కో మాజీ చైర్మన్లు మండల శ్రీరాములు, గడ్డం జగన్నాథం, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

**చేనేత వస్త్ర ప్రదర్శనశాల ప్రారంభం**

పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. స్టాళ్లను సందర్శించి, కార్మికులతో మాట్లాడారు. తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల చేనేత ఉత్పత్తులు, పలు శాఖలకు చెందిన స్టాళ్లు అందరిని ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 17 వరకు ఈ ప్రదర్శన ఉంటుందని శైలజా రామయ్యర్ తెలిపారు.

# యూరియా బస్తాలు ఏమైపోతున్నాయి..?

(మొదటిపేజీ తరువాయి)

పోలిస్తే ఎరువుల అమ్మకాలు భారీగా పెరిగాయి. గతేడాది ఖరీఫ్‌తో పోలిస్తే ఈ ఏడాది ఖరీఫ్‌లో జులై ఆఖరుకు యూరియా అమ్మకం 91వేల టన్నులు పెరిగింది. అయినా ఎరువుల కోసం దుకాణాల ముందు నిరీక్షిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరి ఎటుపోతున్నాయి ఈ ఎరువులన్నీ అనేది అసలు ప్రశ్న. ఎరువుల సరఫరా, అమ్మకాలపై జిల్లాల్లో నిఘా కొరవడటమే దీనికి ప్రధాన కారణం. తనిఖీ బృందాలు..మొక్కుబడిదాడులతో గ్రామ, మండలస్థాయి డీలర్ల వెంటపడుతున్నాయి. యూరియా ఎక్కడ దారిమళ్లుతోందనే అంశాన్ని పట్టించుకోవడం లేదు. ఫలితంగానే రైతులు ఎరువుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బస్తాకు రూ.100కు పైగా అదనంగా చెల్లించాల్సి వస్తోంది. వాస్తవానికి రాష్ట్రంలో వరినాట్లు ఇంకా ముమ్మరం కాలేదు.. ఇటీవలి వరకు వర్షాలూ అనుకూలంగా లేవు. జులై చివరిలో కురిసినా.. వారం నుంచి ఎండలే. దీంతో ఖాళీగా వదిలేసిన పొలాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే ఖరీఫ్‌లో సాగు నెమ్మదించింది. పారిశ్రామిక అవసరాలకు వ్యవసాయ యూరియా రంగుల కంపెనీలు, వార్నిష్, ప్లైవుడ్, యాడ్‌బ్లూ ద్రావణం, బీరు, నాటుసారా, కోళ్లు, పశువుల దాణా, చేపలు, రొయ్యల చెరువుల్లోనూ వ్యవసాయ అవసరాలకు ఉపయోగించాల్సిన యూరియాను వాడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేస్తున్నా.. ఎందుకు కొరత వస్తోందని ఆరా తీయగా.. వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు తేలింది. సరిహద్దు ప్రాంతాల్లోని జిల్లాల నుంచి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకకు యూరియా బస్తాలు తరలుతున్నాయని కొందరు అధికారులు వివరించారు. ఇతర అవసరాలకు ఉపయోగించడమే ప్రధాన సమస్యగా గుర్తించారు. ఇలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది.

# మీసేవ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లందు పట్టణంలోని మీ సేవ కేంద్రాలలో ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించేందుకు గురువారం అదనపు జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో జిల్లా ఈ డిస్ట్రిక్ మేనేజర్ సైదేశ్వర రావు , తెలంగాణ గ్రీవెన్స్ అండ్ ట్రాన్సాక్షన్ సిస్టమ్ జిల్లా మేనేజర్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రాథమికంగా మీసేవ కేంద్రాలలో నిర్వహణ, శుభ్రత, సాంకేతిక వసతులు, సిబ్బంది ప్రవర్తన, సేవల వేగం వంటి అంశాలను తనిఖీ చేసారు. కేంద్రానికి వచ్చిన ప్రజలు చేస్తున్న దరఖాస్తుల — ముఖ్యంగా ఆదాయ ధ్రువపత్రాలు, మౌలిక వృత్తి ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, జనన,మరణ ధ్రువపత్రాలు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులు — వాటి స్థితిని వివరంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎందుకు ఆ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? అని అడిగి తెలుసుకుని, తక్షణమే పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీసేవ ఆపరేటర్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రామాణిక ధరల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక రుసుములు వసూలు చేయరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ప్రజలను మోసగించకుండా పారదర్శకతతో పనిచేయాలని, ప్రతి వినియోగదారుని పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ పర్యటనలో భాగంగా కేంద్రాలలో వున్న సూచిక బోర్డులు, సేవల జాబితా, సేవలకు సంబంధించి రుసుముల వివరాలు స్పష్టంగా ప్రదర్శించబడుతున్నాయా అని కూడా తనిఖీ చేశారు. ప్రజలకు సేవలపై అవగాహన కల్పించే విధంగా వివిధ సేవలకు సంబంధించిన రుసుముల వివరాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండటం మాత్రమే కాదు, ప్రజలకు అవి వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యంగా అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దీనిలో భాగంగా మీసేవ కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తాం అన్నారు. ప్రజల ఫిర్యాదులను జాగ్రత్తగా పరిశీలించి, వేగంగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలి అని తెలిపారు.

## యోగ గురువు గుమలాపురం సత్యనారాయణకి జాతీయ స్థాయిలో ఘనమైన సత్కారం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ స్థాయిలో బెంగళూరులో నిర్వహించిన ఆన్‌లైన్ యోగ జాతీయ ఛాంపియన్‌షిప్ కార్యక్రమాన్ని శివజ్యోతి యోగ సంస్థ ఘనంగా నిర్వహించింది. ఈ పోటీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రముఖ యోగ గురువు గుమలాపురం సత్యనారాయణ శిష్యులు విజయవంతంగా పాల్గొని విజయాలు సాధించారు.ఈ విజయం ద్వారా వారు జాతీయ టీం కప్పు , ప్రశంసాపత్రాలను పొందగా, వారిని బహుమతులతో సత్కరించారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కూడా గుర్తింపుతో పాటు బహుమతులు లభించాయి.ఈ సందర్భంగా కొత్తగూడెం డిఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ గుమలాపురం సత్యనారాయణ ని అభినందించారు. యోగాన్ని మరింత మందికి చేరేలా చూడాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగ పాత్రను ఆయన ప్రశంసించారు.డిఎస్పీ అభినందనలతో ఉత్సాహితులైన సత్యనారాయణ మాట్లాడుతూ సమాజానికి ఆనందం ,ఆరోగ్యాన్ని అందించేందుకు యోగం ద్వారా సేవ కొనసాగిస్తాము అని తెలియజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

- **లబ్ధిదారులకు అందజేసిన నియోజకవర్గ బిఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ:**




ప్రజాస్ఫూర్తి,దుండిగల్: ఆపదలో ఉండి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి,ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిది ఎంతో ఉపయోగపడుతుందని నియోజకవర్గ బిఆర్ఎస్ నేత శంబీపూర్ కృష్ణ అన్నాడు. గురువారం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంజూరు చేయించిన రూ.4,16,500/ సిఎం రిలీఫ్ ఫండ్ సంబంధిత 12 చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేసాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ముఖ్య మంత్రి సహాయనిదిని సద్వినియోగం చేసుకోవాలి అన్నాడు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ లు బుచ్చి రెడ్డి, కొర్ర శంకర్ నాయక్, సాయి యాదవ్, సుధాకర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాఘవేందర్ గౌడ్, సీనియర్ నాయకులు పాల్పనూరి దర్శన్ రెడ్డి, ఆకుల బాబు, మల్లేష్, సాయి ముదిరాజ్, నిజాంపేట్ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిసంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీ లోకి చేరికలు

- **కొలన్ హన్మంత్ రెడ్డి**
- **కాంగ్రెస్ పార్టీలో చేరిన బి ఆర్ ఎస్ మహిళ నాయకులు:**



ప్రజాస్ఫూర్తి, నిజాంపేట్ :తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిసంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నాడు. గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ సీసల బస్తి బిఆర్ఎస్ మహిళ నాయకులు సంతోష, సునీత, పద్మ ,సువర్ణ, వైష్ణవి, కుమారి తెలంగాణ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ ఆధ్వర్యంలో కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి హన్మంత్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, బి .లలిత తదితరులు పాల్గొన్నారు.

## మునగ సాగు ద్వారా ఆదాయవృద్ధికి మోడల్ గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

- **మైలారం రైతు జమీల్ సక్సెస్ స్టోరీను వివరించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్**
- **అభినందించిన కేంద్రస్థాయి అధికారులు**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో గురువారం నిర్వహించిన "ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అండ్ బ్లాక్స్"పై జాతీయ స్థాయి సెమినార్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగుతున్న మునగ (మోరింగా) సాగు గురించి వివరించారు.భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణలో అతిపెద్ద జిల్లా కాగా, 50% కంటే ఎక్కువ భాగం అడవులతో కప్పబడినది. సుమారు 37% జనాభా గిరిజన సమాజానికి చెందినది. భౌగోళికంగా కలిపి ఉన్న భూములు, సమృద్ధిగా వర్షపాతం ఉన్నా, సాగు నీరు అందుబాటు తక్కువగా ఉంది. రైతులు ముఖ్యంగా పత్తి, మొక్క జొన్న వంటి పంటలు సాగు చేస్తూ తక్కువ ఆదాయం పొందుతున్నారు. పత్తిలో ఎకరాకు సగటున రూ.15,000 మక్కలో రూ.30,000 మాత్రమే లాభం వస్తోంది.ఈ నేపథ్యంలో రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం మునగ సాగును ప్రోత్సహించడం ప్రారంభించింది. టీఎన్ఏయూ (కోయంబత్తూర్) స్థానిక వ్యవసాయ కళాశాల (అశ్వారావుపేట) నిపుణులతో సంప్రదించి, కర పత్రాల (పాంఫ్లేట్స్ ) ద్వారా రైతులకు సమాచారం అందించేయడంతో ఎన్ఆర్ఈజీఎస్ వంటి పథకాల సహాయంతో చిన్న, సన్నకారు రైతులు ఖర్చు లేకుండానే మునగ సాగు ప్రారంభించగలుగుతున్నారు.

**మునగ సాగు ఆదాయ విశ్లేషన**

ఒక ఎకరాలో సుమారు 1000 మొక్కలు ఉంటాయి. కనీసం ఒక్కో మొక్కకు 100 కాయలు వచ్చినా, వాటిని రూ.2 ధరకు విక్రయిస్తే రూ.2 లక్షల ఆదాయం పొందవచ్చు. ఆకుల విక్రయంతో అదనంగా రూ.20,000 లాభం వస్తోంది.ఈ ఆదాయంతో రైతులు కూరగాయల సాగు, నాటు కోడి పెంపకం, చేపల చెరువులు వంటి అనుబంధ కార్యకలాపాలను చేపడుతూ ఏకీకృత వ్యవసాయ విధానానికి మారుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 415 ఎకరాల్లో మునగ సాగు ప్రారంభమైందని, ఇందులో 100 ఎకరాల్లో మునగను ప్రధాన పంటగా, 300 ఎకరాల్లో అంతర పంటగా సాగుచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైలారం గ్రామానికి చెందిన రైతు జమీల్ కథను కలెక్టర్ ఉదాహరణగా వివరించారు. "మునగ ఆకులతో కోళ్లకు మేత వేసి అదనపు ఆదాయం పొందారు. ప్రస్తుతం ఆయన క్వయిల్ (కౌంజు పిట్టలు) యూనిట్ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు అని పేర్కొన్నారు.ఈ ప్రాక్టీస్‌లో ప్రధానంగా రైతుల అనుమానాలను తొలగించి, భయాలను నివారించడం, గ్రామీణ స్థాయిలో విజేతల అనుభవాలు పంచుకోవడం వంటి అంశాలు, రైతులను ప్రయోగాత్మకంగా ముందడుగు వేయించేలా చేశాయని కలెక్టర్ వివరించారు.ఈ సెమినార్‌లో పాల్గొన్న కేంద్ర స్థాయి అధికారులు , ఇతర జిల్లాల కలెక్టర్‌లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమలవుతున్న మునగ సాగు కార్యక్రమాన్ని అభినందించారు.



## దోమల వృద్ధిని అరికట్టేందుకు డ్రై డే కార్యక్రమాలను ముమ్మరంగా అమలు చేయాలి

**శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : పారిశుధ్య పనులు , దోమల వృద్ధిని అరికట్టేందుకు డ్రై డే కార్యక్రమాలను ముమ్మరంగా అమలు చేయాలని శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ సంబంధిత అధికారులకు సూచించారు.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పిలుపు మేరకు వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా నిరోధించేందుకు చేపట్టిన వర్షాకాల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమానికి (శానిటేషన్ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్) శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ , ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ , కూకట్పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గంగాధర్ లతో కలిసి ఆల్విన్ కాలనీ డివిజన్ మొత్తం పాదయాత్ర చేస్తూ తనిఖీలు చేసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటెన్సివ్ శానిటేషన్ డ్రైవ్‌లు, యాంటీలార్వా స్ప్రేయింగ్ ఆపరేషన్‌లు, సీజనల్ డిసీజ్ నివారణ అంశాలు క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ నిర్వహించాలని అన్నారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారి అయిన ఉషముళ్ళపూడి రోడ్డు విస్తరణ పనులు కూడా వేగవంతం చేయాలని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్ల భద్రత పెంపొందించడంలో భాగంగా రోడ్ సేఫ్టీ డ్రైవ్‌ను కూడా జీహెచ్ఎంసీ నిర్వహిస్తుందని తెలియచేసారు. ప్రజలు కూడా జి.ఎచ్.ఎం.సి సిబ్బందికి సహకరించి చెత్తను వీధుల్లోనూ కాలువలోను వేయకుండా తడి చెత్త పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. రోగాలు ప్రబలకుండా ముఖ్యంగా పిల్లలు పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకునే విధంగా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేసారు. తడిగా ఉన్న కరెంట్ స్తంబాలలో విద్యుత్ ప్రవహించి షాక్ కొట్టే ప్రమాదం ఉంది కాబట్టి వాటికి దూరంగా ఉండాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జి.ఎచ్.ఎం.సి అధికారులు ఇ.ఇ గోవర్ధన్ గౌడ్, ఎ.ఎం.ఒ.ఎచ్ శ్రీనివాస్, ఎ.సి.పి జిషాన్, యూ.బి.డి మేనేజర్ మనోహర్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ . దీపాంకర్ పాల్, పి.ఓ రాజశేఖర్, సి.ఓ ముస్తఫా, ఎస్.ఆర్.పి ఎ. నాగేశ్వర నాయక్, డి.ఇ రమేష్, ఇంజినీరింగ్ విభాగం ఎ.ఇ శ్రావణి, ఎంటమాలజి ఎ.ఇ తేజ శ్రీ, ఎంటమాలజి సూపర్వైజర్ డి.నరసింహులు, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యూ.బి.డి సూపర్వైజర్ నాగ రాణి, టి.పి.ఎస్ మధు, ఎన్.ఎ.సి విశ్వనాథ్, జి.ఎచ్.ఎం.సి విభాగాల సిబ్బంది,నాయకులు జిల్లా గణేష్, కృష్ణారావు, కట్టా శ్రీనివాస్, బి.వెంకటేష్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



**తెలంగాణలో 42% బీసీ రిజర్వేషన్ల సాధనకై, దేశ రాజధాని ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద బిసీ పోరుబాట ధర్నా అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిట్ట సునీల్ కుమార్ యాదవ్ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు.**

**కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) :**

## గ్రామీణ వికాసం బిజెపితోనే సాధ్యం



ప్రజాస్ఫూర్తి , ఇల్లందు: గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యమని బిజెపి రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. ఇల్లందు మండల కేంద్రంలో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం ఇందిరానగర్ గ్రామ పంచాయతీ బూత్ నెంబర్ 89, 110 లల్లో మండల అధ్యక్షులు భట్టు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు ప్రచారం చేస్తూ, నరేంద్ర మోడీ పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు తెలిపి త్వరలో జరగబోవు స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. గ్రామీణ వికాసం బిజేపీ పార్టీ తోనే సాధ్యమవుతుందని రానున్న స్థానిక ఎన్నికల్లో బిజేపీ అభ్యర్థులకు అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంచందర్ నాయక్, శ్రీకాంత్, రాజేష్, సందీప్, నర్సింహారెడ్డి, సతీష్, వీరన్న, పవన్, ఇంద్ర కుమార్, రాజా, రజత్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



ప్రజాస్ఫూర్తి , ఇల్లందు: బిసి సమాజం అభ్యున్నతికి కృషి చేస్తున్న గొప్ప దార్శనికత గల నాయకుడు మన రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బిసిలకు 42% రిజర్వేషన్ సాధనలో భాగంగా టిపిసిసి పిలుపు భాగంగా బుధవారం జంతర్ మంతర్ లో జరిగిన ధర్నా కార్యక్రమంలో సహచర కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి పాల్గొని గురువారం తెలంగాణ రాష్టం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి బిసి సమాజం ఆభ్యున్నతికి,జనాభా ధమషా ప్రకారం వారికి రావాల్సిన 42% రిజర్వేషన్ సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం పై పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రి కి ధన్యవాదములు తెలిపారు. ఆయన వెంట బయ్యారం మండలం సైటి చైర్మెన్ మూల మధుకర్ రెడ్డి,నాయకులు భుక్యా ప్రవీణ్ నాయక్ తదితరులు ఉన్నారు

## ఆపదలో అండగా రాజన్న

**ముఖ్య మంత్రి సహాయనిది చెక్కు అందజేత:**
**కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు:**



ప్రజాస్ఫూర్తి, నిజాంపేట్ :నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న అత్తిరి రంగా అనారోగ్యానికి గురికావడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక ఇబ్బందులను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ యువజన అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దృష్టికి తీసుకెల్లాడు. వెంటనే స్పందించిన శంబీపూర్ రాజు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును శంభీపూర్ లోని ఆయన కార్యాలయంలో అందజేశాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి సూచించారు.స్థానిక ప్రజల సమస్యను తన దృష్టికి తెచ్చిన ప్రవీణ్ గౌడ్ ను ఎమ్మెల్సి అభినందించాడు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ శంబీపూర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎన్ఎంసి బిఆర్ఎస్ యువజన అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, 16 వ డివిజన్ అధ్యక్షులు ఖాదారయ్య, చెన్నకేశవ్ (బిఆర్ఎస్వి) పాల్గొన్నారు.

# క్యూబా ప్రజలకు అండగా నిలిచి విరాళాలు ఇవ్వాలి

*** సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అమెరికా నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు అండగా నిలిచి విరాళాలు ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆమెరికా నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు సంఘీభావంగాసిఐటియు జీడిమెట్ల క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో సూరారం డివిజన్ షాపూర్ నగర్ మార్కెట్లో నిధి వసూలు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ సిఐటియు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ లు పాల్గొని మాట్లాడుతూ ఆమెరికా నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు సంఘీభావంగా విరాళాలు ఇవ్వాలన్నారు. అమెరికాకు 90 మైళ్ళ దూరంలో ఉన్న చిన్న ద్వీపం క్యూబా కోటి 15 లక్షల జనాభాతో 1959లో సోషలిస్టు దేశంగా క్యూబాను ప్రకటించుకుందన్నారు. గత 60 ఏళ్లుగా



అమెరికా దాష్టికాన్ని ఎదిరించి నిలబడుతున్నది విప్లవం విజయవంతమైన తెల్లారి నుండే క్యూబా పై అమెరికా ఆంక్షలు విధించడం ద్వారా క్యూబా ప్రజల స్ఫూర్తిని దెబ్బతీయాలన్నారు. అమెరికన్ పాలకులు ప్రయత్నం చేస్తుంటే 60 ఏళ్లుగా అమెరికన్ సామ్రాజ్యవాద ఆంక్షలుకు వ్యతిరేకంగా క్యూబా ప్రజలు పోరాడుతూనే తమ దేశాన్ని ముందుకు తీసుకుపోతున్నారన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు సిఐటియు ఆవిర్భావం నుండి ధన వస్తు రూపాల్లో అనేకమార్లు క్యూబా ప్రజలకు అందించడం జరిగిందన్నారు. మనదేశంలోని నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా కమిటీలో సిఐటియు కూడా భాగస్వామిగా ఉండి కార్మిక సంస్థగా అంతర్జాతీయతతో పని చేస్తూ ప్రపంచ కార్మిక వర్గానికి అండగా నిలబడుతుందన్నారు. సిఐటియు అనుబంధంగా ఉన్న అన్ని సంఘాలు కమిటీలు నాయకులు ఆగస్టు 2 నుండి 10 వరకు కార్మిక వర్గం నుండి క్యూబా సంఘీభావ నిధిని వసూలు చేసి సోషలిస్ట్ క్యూబాకు అందించి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబాకు అండగా ఉండాలని కార్మిక వర్గం ఎప్పుడు అంతర్జాతీయ తత్వంతో ఉంటుందన్నారు. మన రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులు క్యూబా పై అమెరికా సామ్రాజ్యవాదం విధిస్తున్న ఆంక్షలకు వ్యతిరేకంగా గొంతు ఎత్తడమే కాకుండా ప్రతిరంగంలోని ప్రతి కార్మికుడు కూడా క్యూబాకు ఆర్థికంగా సంఘీభావ నిధిని అందించడం మన కర్తవ్యం గా భావించాలన్నారు. రాష్ట్రంలో వసూలు చేసిన నిధిని క్యూబా ప్రజలకు అవసరమైన విద్యుత్ జనరేటర్స్ నిత్యవసర సరుకులు మందులు వంటివి క్యూబాకు అందించాలన్నారు. భారతదేశ ప్రభుత్వ రంగ పరిశ్రమల నాశనం వెనుక అమెరికా హస్తం ఉందన్నారు. కార్మిక చట్టాలన్నీ రద్దుకు అమెరికా ఒత్తిడిలే కీలకం అమెరికా వల్లే భారతీయ పరిశ్రమలెన్నో విలవిల్లాడి మూతపడుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రతి కార్మికుడు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగం కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జీడిమెట్ల క్లస్టర్ అధ్యక్ష కార్యదర్శులు పసుల అంజయ్య, రమేష్ , సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, కృష్ణ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ హయంలో కోట్లాది రూపాయలతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశాం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి): గత 12 ఏళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి బీరప్ప నగర్ టెంపుల్ రోడ్, జగద్గిరి నగర్ రోడ్ నెం.1 కాలనీలలో సుమారు రూ.25.00 లక్షల లతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు ఆయనతో పాటు జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మౌళిక వసతుల కల్పనలో కుత్బుల్లాపూర్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.. అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బీరప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు శేఖర్, సత్యనారాయణ యాదవ్, కోశాధికారి సుధాకర్, శ్రావణ్ కుమార్, కార్యనిర్వాహ కార్యదర్శిలు అనంతరెడ్డి, రామచంద్రయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉపేందర్ రెడ్డి, గోపాల్ రావు, సంపత్, వెంకట్ రెడ్డి, వెంకటెష్, హరినాథ్ రావు, సుధాకర్, బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆజమ్, మల్లేష్ గౌడ్, పాపిరెడ్డి, బండ మహేందర్, మెట్ల శ్రీను, చారి, విఠల్, నర్సింహా రెడ్డి, బ్రహ్మానంద చారి, సాజిద్, విఘ్నేష్, మహిళా నాయకురాలు ఇందిరా గౌడ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి దీవెనలతో దేవాలయ నిర్మాణ పనులు బ్రహ్మాండంగా సాగాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : పోచమ్మ అమ్మవారి దీవెనలతో దేవాలయ నిర్మాణ పనులు బ్రహ్మాండంగా సాగాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ బీరప్ప నగర్ లోని పోచమ్మ దేవాలయం పునః నిర్మాణ పనులల్లో భాగంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై దేవాలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచమ్మ అమ్మవారి దయతో దేవాలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. పోచమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని, అన్న దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బీరప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు శేఖర్, సత్యనారాయణ యాదవ్, కోశాధికారి సుధాకర్, శ్రావణ్ కుమార్, కార్యనిర్వాహ కార్యదర్శిలు అనంతరెడ్డి, రామచంద్రయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉపేందర్ రెడ్డి, గోపాల్ రావు, సంపత్, వెంకట్ రెడ్డి, వెంకటెష్, హరినాథ్ రావు, సుధాకర్, బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆజమ్, మల్లేష్ గౌడ్, పాపిరెడ్డి, బండ మహేందర్, మెట్ల శ్రీను, చారి, విఠల్, నర్సింహా రెడ్డి, బ్రహ్మానంద చారి, సాజిద్, విఘ్నేష్, మహిళా నాయకురాలు ఇందిరా గౌడ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.





## హ్యాట్సాఫ్ సిఐ సార్

*** చారిత్రక మార్పుకు శ్రీకారం:**
*** ఇంటి వద్దకే ఏఫ్ఐఆర్:**
*** ప్రయోగాత్మకంగా బాలానగర్ పిఎస్ లో అమలు:**
*** పోలీస్ వ్యవస్థపై మరింత నమ్మకం పెంచే ప్రయత్నం:**
*** అశ్చర్యపోయిన ప్రజలు**

ప్రజాస్ఫూర్తి,కూకట్పల్లి :ప్రజలకు పోలీస్ వ్యవస్థపై మరింత నమ్మకం ఏర్పడేలా బాలానగర్ సిఐ నర్సింహారాజు సంస్థాగత మార్పుకు శ్రీకారం చుట్టాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో చేపట్టిన "ఇంటి వద్దకే ఏఫ్ఐఆర్ కాపీ" కార్యక్రమం రానున్న రోజుల్లో పోలీస్ లను ప్రజలకు మరింత దగ్గర చెసి, పిర్యాదుదారులకు కొండంత భరోసా ఇచ్చేలా ఉందని చెప్పవచ్చు.సాధారణంగా ప్రాథమిక సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్) కోసం ఫిర్యాదుదారులు పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతూ ఉండటం మనం చూస్తుంటాం. ఒక్కసారి కొందరు అధికారులు ఏఫ్ఐఆర్ కాపీ పిర్యాదు దారులకు ఇచ్చేందుకు అనాసక్తి గా ఉండటం మనం అక్కడక్కడ చూస్తూనే ఉంటాం.కానీ సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి ఐపీస్ ఆదేశాల మేరకు బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో గురువారం ప్రయోగాత్మకంగా వయవృద్ధుల ఫిర్యాదు పై ఎఫ్ఐఆర్ నమోదుచేసి పోలీస్ స్టేషన్ నుంచి సీఐ నర్సింహా రాజు, ఎస్ఐ సరితా పటేల్ రెడ్డి, వినోద్ తో కలిసి నేరుగా ఫిర్యాదుదారుల ఇంటికి వెళ్లి ఏఫ్ఐఆర్ కాపిని అందజేశారు. దీంతో ఆశ్చర్యపోయిన ఫిర్యాదుదారులు, గమనించిన స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సైబరాబాద్ సిపికి, బాలానగర్ సీఐ నర్సింహా రాజుకు, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ కాపీ కోసం అనేకసార్లు చక్కర్లు కొట్టాల్సిన అవసరం లేకుండా చేసే ప్రయత్నం ఇది అన్నాడు. వయవృద్ధుల, వికలాంగులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, ఎఫ్ఐఆర్ నమోదుచేసి వారి ఇళ్లకు వెళ్లి అందిస్తే ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం మరింత విశ్వాసం పెంచాలనే ఉద్దేశంతో ఈ విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. అంతేకాక సున్నితమైన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్లు మఫ్టీలో ఇంటికి వెళ్లి ఎఫ్ఐఆర్ కాపీ అందజేస్తామని వివరించారు.

## రాజ్యాంగం కల్పించిన హక్కుల పై అవగాహన కలిగి ఉండాలి

*** జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి**

ప్రజాస్ఫూర్తి ఇల్లందు :గిరిజన హక్కుల దినోత్సవాన్ని పునస్కరించుకొని గురువారం ఇల్లందు కోర్టు ఆవరణం నందు ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ పౌరులు తమ హక్కులను గురించి తెలుసుకోవడం వలన పని చేసే చోట వివక్షకు,ఆర్థిక అసమానతలకు గురికాకుండా ప్రశ్నించే తత్వం వస్తుందని,ముఖ్యంగా మహిళలు శారీరకంగా, లైంగికంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని,ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలను చదివించే ఆర్థిక స్తోమత లేని కారణంగా విద్యా భవిష్యత్తు మధ్యలోనే ఆగి పోవాల్సి వస్తుందని, వసతి గృహాల్లో ఉండే బాల బాలికలు సరియైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మా దృష్టికి వచ్చిందని సందర్భంగా వారు తెలిపారు. ఆర్థిక స్తోమత లేని కక్షిదారులకు కోర్టు ద్వారా ఉచిత న్యాయవాదిని నియమిస్తామని, మీరు కూడా మీ చుట్టూ



పక్కల ప్రాంతాల్లో జరిగే అన్యాయాల, అక్రమాలపై, వసతి గృహాల వసతులపై మీ దృష్టికి వచ్చిన సమస్యలపై మాకు లేఖ ద్వారా సమాచారం అందించినట్లయితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపినారు, అనంతరం కక్షిదారులకు జడ్జి గారి చేతుల మీదుగా మొక్కల పంపిణీ చేసినారు, అందరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించవలసిందిగా వారు కోరినారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాంపల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు ఎస్. వెంకటనరసయ్య కె.నారాయణ, ఎస్. వెంకటేశ్వర్లు, కోర్టు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో కీలకం

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో కీలకమని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గురువారం సూరారం డివిజన్ సూరారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. అధునాతన పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు వారికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకునేందుకు కంప్యూటర్ ల్యాబ్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో



కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, నాయకులు బాలేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నాగ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



ప్రజాస్ఫూర్తి, దుండిగల్ :బౌరంపేట్ లోని శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి నాగ ప్రతిష్ట, బోనాల కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ముఖ్య అతిధిగా పాల్గొన్నాడు.ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శంబీపూర్ క్రిష్ణ మాట్లాడుతూ ఆలయ ప్రతిష్ట మహోత్సవం, శ్రావణమాస బోనాల పండుగ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు వెంబడి బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, పాక్స్ డైరెక్టర్లు అర్కల జీతయ్య సర్గారి బీమ్, సత్తిరెడ్డి, వెంకటేష్ యాదవ్, మహిపాల్ రెడ్డి, మోహన్ నాయక్, సీనియర్ నాయకులు ఆకుల బాబు, సాయి ముదిరాజ్, బాలకృష్ణ, అంతమొల్ల కిట్టు, గడిలా బాబు, గడీలా రవి, శ్రీకాంత్, తలారి సాయి, రవి రాజ్, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మా ప్రభుత్వం వస్తే చేనేత కళాకారులకు న్యాయం

*** రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు**
*** యాదగిరిగుట్ట లక్ష్మినరసింహస్వామి దర్శనం చేసుకున్న బిజెపి తెలంగాణ అధ్యక్షులు**



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి ఈరోజు యాదగిరిగుట్టలో గురువారం ఉదయం స్వామి వారి దర్శనం అనంతరం 11వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమము సందర్భంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ ప్రభుత్వము ఎన్నికల వాగ్దానంలో భాగంగా కామారెడ్డి డిక్లరేషన్ లో తెలంగాణ వ్యాప్తంగా మూడు క్లస్టర్ మంజూరు చేసి చేనేత కళాకారులకు చెందిన పని కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఆమె హామీ ఇప్పటివరకు కూడా నెరవేర్చలేదు అలాగే కేంద్ర ప్రభుత్వం వీవర్ సర్వీస్ సెంటర్ ద్వారా అనేకమైనటువంటి సంక్షేమ పథకాలు అమలుపరుస్తూ 90% సబ్సిడీతో వారికి స్టాండ మగ్గాలు , ఇలా అనేక మైనటువంటి సంక్షేమ పథకాల అమలు పరుస్తున్నది రాబోయే కాలంలో తెలంగాణ ప్రభుత్వము రేవంత్ రెడ్డి ప్రభుత్వము ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీని నెరవేర్చని కారణంగా రామచంద్ర రావు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని పై ఒత్తిడి తెచ్చి ఈ యొక్క చేనేత కళాకారులకు న్యాయం చేస్తామని వారు హామీ ఇవ్వడం జరిగింది అ తర్వాత పట్టణం నుండి భువనగిరి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు,యాదాద్రి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాదాల శ్రీనివాస్, దాసరి మల్లేశం,వట్టి పల్లి శ్రీనివాస్,బీజేపీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య,మాజీ చేనేత విభాగం కన్వీనర్ కర్నాట ధనుంజయఅలాగే ఎన్నం శివకుమార్, మచ్చ సుధాక ర్రచ్చ శ్రీనివాస్ గంజి బసవలింగం యాదగిరిగుట్ట బిజెపి ప్రెసిడెంట్ కరే ప్రవీణ్ కుమార్ చేనేత రాష్ట్ర జిల్లా మండల చేనేత కళాకారులు , మండల అధ్యక్షురాలు గుంటి పల్లి మహేశ్వరి సత్యనారాయణ, రాజాపేట అధ్యక్షులు రమేష్ , బొమ్మలరామారం అధ్యక్షులు వినోద్, తుర్కపల్లి అధ్యక్షులు శ్రీను,జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి ,మహేష్ , పట్టణ ప్రధాన కార్యదర్శిలు మందోజు నరేష్,జెల్ల భాను చందర్,పట్టణ ఉపాధ్యక్షురాలు బోడ రాధ,మిట్ట వీరేష్,గోపగాని ప్రసాద్, నారాయణ,కార్యదర్శులు ఆవుల సత్యనారాయణ, సురేష్, సుంచు శ్రవణ్,చింతల సునీత , సీనియర్ నాయకులు నల్ల వెంకటరెడ్డి ,నరేందర్ ,బెలిదే అశోక్ రంగ సత్యం, తాళ్ల భాస్కర్ రెడ్డి బొమ్మగాని రాజమణి ,బొడ్డు సుజాత,సుదుగు రాజిరెడ్డి ,బోడ బుచ్చిబాబు ,ఆకుల దేవేందర్, శ్రీశిల్పం, రమేష్ వంశీ ,నవీన్ ,కొన్నె ప్రశాంత్ ,సంద ప్రవీణ్ ,కర్ర శామ్ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నంబర్ 155 లోని ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ వేసిన హైడ్రా

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : సర్వే నంబర్ 155, భగత్ సింగ్ నగర్ లోని ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడేందుకు హైడ్రా అధికారులు ఎట్టకేలకు చుట్టు పెన్సింగ్ వేశారు. గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో దోభీఘాట్ ఖాళీ స్థలం చుట్టు పోలీసుల బందో బస్తుతో పెన్సింగ్ వేస్తున్నారు. ఇక్కడి 3500 గజాల్లో నాళాకు ఒకవైపు అక్రమ కట్టడాలు, మరోవైపు స్థలం కబ్జా జరిగింది. కాగా ఫెన్సింగ్ తో సరిపెట్టిన అధికారులు మరోవైపు వున్న అక్రమ కట్టడాలు తొలగించలేదు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇటీవలే నిర్మించిన కట్టడాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

**ఫిర్యాదుదారుడిపై దాడి**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ సర్వే నంబర్ 155 లో ప్రభుత్వ స్థలం కబ్జాదారుల పాలవుతుందని దానిని కాపాడాలని గతంలో కాలనీ మాజీ అధ్యక్షులు దూదేకుల, అల్లా బక్షు (55) గతంలో హైడ్రాకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కబ్జా స్థలానికి





గతంలో హైడ్రా అధికారి రంగనాథ్ పరిశీలించి కబ్జాను అడ్డుకోవాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఆదేశించి వెళ్లిపోయారు. హైడ్రాకు ఫిర్యాదు చేసి స్థలాన్ని కాపాడే ప్రయత్నం చేసిన ఫిర్యాదుదారుడు అల్లా బక్షు పై భగత్ సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన కొండల శ్రీధర్ రావు, బాలు అనే వ్యక్తులు 20 మందితో కలిసి తన ఇంటి పై దాడి చేశారని అల్లా బక్షు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తనపై జరిగిన దాడిని అడ్డుకునే ప్రయత్నం చేసిన తన భార్యపై కూడా చేసి గాయపరిచారని, చూసి అడ్డుకోకపోయినా లక్ష్మమ్మ, గత సుబ్బమ్మ లను లాగి పరేశారని, గతంలో వీడియో తీసిన యువకుడిని చితక భాదరిని, వీడియోలు డిలీట్ చేసి నిన్ను చంపేస్తామంటూ కాలనీలో భయభ్రాంతులను సృష్టించారని హైడ్రా ఫిర్యాదుదారుడు అల్లాబక్షు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

## విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్.. CBSE వినూత్న కార్యక్రమాలు!

దిల్లీ: మారుతోన్న కాలానికనుగుణంగా విద్యార్థులకు మరిన్ని మెరుగైన వసతులు అందించేలా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ రెండు వినూత్న కార్యక్రమాలను ప్రారంభించింది. 202526 విద్యా సంవత్సరానికి గాను కెరీర్ గైడెన్స్ డాష్‌బోర్డ్, కౌన్సెలింగ్ హబ్ అండ్ స్పోక్ స్కూల్ మోడల్ అనే ఈ రెండు కార్యక్రమాలను ప్రారంభించినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కోసం సంస్థాగత విధానాలను బలోపేతం చేయడం, వారి మానసిక, సామాజిక శ్రేయస్సే వీటి ప్రధాన లక్ష్యమని పేర్కొంది. ఈ సందర్భంగా సీబీఎస్ఈ ఛైర్మన్ రాహుల్ సింగ్ మాట్లాడుతూ.. వీటిని పాఠశాలలు, విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా రూపొందించినట్లు చెప్పారు. తమకు వచ్చే సూచనల ఆధారంగా వీటిని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఓరియంటేషన్ కమ్ ఇంటరాక్షన్ సెషన్‌లో నిపుణుల బృందాలు కెరీర్ గైడెన్స్ డాష్‌బోర్డు గురించి వివరించాయి.




ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల లీడర్లకు అందుబాటులో ఉండే ముఖ్యమైన అంశాలు, ఫీచర్లు, వసతులను గురించి తెలిపారు. సీబీఎస్ఈ కౌన్సెలింగ్ హబ్ అండ్ స్పోక్ మోడల్ అమలు విధానం, పాఠశాల స్థాయి బాధ్యతలు, పర్యవేక్షణ యంత్రాంగాల గురించి ఒక ప్రత్యేకమైన సెషన్ నిర్వహించారు. ఈ కొత్త కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తమ కెరీర్ ఎంపికలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## భయంతో నిద్ర పట్టట్లేదు.. మమ్మల్ని వేరేచోటకి తరలించండి ప్లీజ్..!

శ్రీనగర్: ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా జమ్ముకశ్మీర్‌లోని కుల్గాం ప్రాంతంలో సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది. గత వారం రోజులుగా ఆ ప్రాంతం తుపాకీ శబ్దాలతో దద్దరిల్లుతోంది. మహిళలు, చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో నిద్ర పట్టడం లేదని, తమను వేరే చోటకి తరలించాలని అఖల్ గ్రామానికి చెందిన ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. '' నిరంతరాయంగా కొనసాగుతున్న కాల్పులతో మాకు నిద్ర పట్టడం లేదు. బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. ఆహార నిల్వలు, మందులు కూడా నిండుకున్నాయి. పిల్లలు, మహిళలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటూ జీవిస్తున్నారు. కొందరిలో మానసిక సమస్యలు తలెత్తాయి'' అని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గతవారం రోజులుగా నిద్ర కరవైందని వాపోయారు. ప్రభుత్వం, స్థానిక అధికారులు



తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీరు, ఆహారం సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. వీలైతే గ్రామం మొత్తాన్ని ఖాళీ చేయించి, తాత్కాలికంగా సురక్షిత ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో ఆగస్టు 1న కుల్గాంలోని అఖల్ గ్రామం పరిసరాల్లో సైన్యం ఆపరేషన్ చేపట్టింది. ఇప్పటి వరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమవ్వగా.. మిగతావారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఉగ్ర కదలికలను గమనించేందుకు డ్రోన్లు, హెలికాప్టర్లను కూడా రంగంలోకి దించారు. ఈ ఏడాదిలో ఇంత సుదీర్ఘ సమయం కొనసాగుతున్న ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ఇదేనని అధికారులు చెబుతున్నారు.

## సువేందు అధికారి కాన్వాయ్‌పై దాడి.. జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష నేత, భాజపా కీలక నేత సువేందు అధికారి కాన్వాయ్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూచ్ బెహర్‌లో ఆయన కాన్వాయ్‌పై టీఎంసీ గూండాలు దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ దాడి పోలీసుల సమక్షంలోనే జరగడం ఇంకా ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ ఘటన మమతా బెనర్జీ ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం ఒక ప్రజాప్రతినిధిపై జరిగిన దాడి కాదు.. ప్రజాస్వామ్యంపైనే జరిగిన దాడిగా అభివర్ణించారు. తాను సువేందు అధికారితో మాట్లాడి ఆయన పరిస్థితి గురించి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. బెంగాల్‌లో ఒక ప్రతిపక్ష నేతకే రక్షణ లేకపోతే.. ఇంకా సామాన్య ప్రజల దుస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక, రాజకీయ హింసాత్మక ఘటనలకు మమతా బెనర్జీ జవాబుదారీగా ఉండాలన్నారు. మరోవైపు, ఇటీవల భాజపా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా మంగళవారం సువేందు అధికారి జిల్లా ఎస్పీకి మెమోరాండం ఇచ్చేందుకు వెళ్తుండగా అనుమానిత తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఆయన కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయన వాహనం ధ్వంసమైంది. ఈ ఘటనలో మంత్రి ఉదయాన్ గుహాతో పాటు



మొత్తం 41 మంది వ్యక్తులపై భాజపా ఫిర్యాదు చేసింది. ఇప్పటివరకు పోలీసులు కూచ్ బెహర్‌లో పలుచోట్ల ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## త్వరలో భారత పర్యటనకు పుతిన్..!

రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. ఆయన పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దొభాల్ వెల్లడించారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న దొభాల్.. రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షొయిగుతో సమావేశమైన అనంతరం ఈ ప్రకటన చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన వేళ ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది చివర్లో పుతిన్ భారత్‌కు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దండయాత్ర అనంతరం ఆయన భారత్‌కు రావడం ఇదే మొదటిసారి అవుతుంది. ఇదిలా ఉండగా.. గత ఏడాది ప్రధాని మోదీ, పుతిన్ రెండుసార్లు కలుసుకున్నారు. జులైలో ఇరుదేశాల శిఖరాగ్ర



సమావేశానికి ప్రధాని మోదీ మాస్కోకు వెళ్లారు. ఆ సందర్భంలో ఆయన ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్' అందుకున్నారు. అక్టోబరులో బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో మరోసారి సమావేశమయ్యారు.

## రూ.23వేల కోట్ల హవాలా సొమ్ము.. బాధితులకు చేరింది: కేంద్రం




దిల్లీ: మనీలాండరింగ్ నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటివరకు రూ.23వేల కోట్ల హవాలా సొమ్మును స్వాధీనం చేసుకుంది. ఆ మొత్తాన్ని ఆర్థిక నేరాల బాధితులకు చెల్లించినట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం సుప్రీంకోర్టుకు తెలిపారు. దివాలా తీసిన భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ (బీపీఎస్ఎల్) ఆస్తుల విక్రయానికి అనుమతినిస్తూ ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సమీక్షించాలని అభ్యర్థనలు రావడంతో రివ్యూ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం విచారణ జరుగుతుండగా.. ఓ న్యాయవాది మాట్లాడుతూ బీపీఎస్ఎల్‌పై ఈడీ కేసు గురించి ప్రస్తావించారు. దీనికి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ బదులిస్తూ.. 'ఇక్కడ కూడా ఈడీ ఉందా?' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. ''ఇక్కడో వాస్తవం చెప్పాలి. ఈ విషయాన్ని ఇంతవరకూ మేం ఏ కోర్టులోనూ చెప్పలేదు. ఇప్పటివరకు ఈడీ మనీలాండరింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా రూ.23వేల కోట్లను స్వాధీనం చేసుకుంది. ఆ మొత్తం దేశ ఖజానాలో ఉండదు. దాన్ని బాధితులకు ఈడీ చెల్లించింది'' అని వివరించారు. అయితే, ఈ కేసుల్లో శిక్షల రేటు ఎలా ఉందని సీజేఐ అడగ్గా.. శిక్షలు పడిన సందర్భాలు తక్కువే అని ఎస్జీ కోర్టుకు తెలిపారు. ''దోషులుగా తేలకపోయినా.. విచారణ పేరుతో సంవత్సరాల పాటు మీరు వారికి శిక్ష వేస్తున్నారు కదా'' అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.

## ఆ ఒక్క నియోజకవర్గంలోనే లక్ష నకిలీ ఓట్లు!

**- రాహుల్ ఆరోపణలు**

కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. అనేక రాష్ట్రాల ఓటర్ల జాబితాలో నకిలీ వ్యక్తుల పేర్లు ఉన్నాయని ఆరోపించారు. ఎగ్జిట్ పోల్స్, ఒపీనియన్ పోల్స్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వస్తున్నాయని, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఫలితాలు తమ అనుమానాలకు బలం చేకూర్చాయని చెప్పారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపించిన ఆయన.. ఇందుకు సంబంధించి మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ''మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారు. ఐదేళ్లలో నమోదైన వారి కంటే.. ఐదు నెలల్లో నమోదైన ఓటర్లే ఎక్కువ. మహారాష్ట్రలో లోక్‌సభ, విధానసభ ఎన్నికల మధ్య సమయంలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారు. ఓటర్ల జాబితా మాకు ఇచ్చేందుకు ఈసీ నిరాకరించింది. అది




దేశ సంపద.. దానిని ఎందుకు చూపించట్లేదు'' అని రాహుల్ ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న తమ అనుమానం మహారాష్ట్ర ఫలితాలతో నిజమైందన్నారు. మెషిన్ రీడ్ చేయగల ఓటరు లిస్టును ఎన్నికల సంఘం ఇవ్వకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నారు. అటు కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 6.5లక్షల ఓట్లకు గాను లక్ష ఓట్లు నకిలీవి, తప్పుడు చిరునామావేనని తమ పరిశోధనలో తేలిందని చెప్పారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ, మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల జాబితాను విశ్లేషించామని రాహుల్ గాంధీ వెల్లడించారు. ''ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో 11,965 డూప్లికేట్ ఓటర్లు, 40,009 నకిలీ, తప్పుడు చిరునామా, 10,452 బల్క్ లేదా సింగిల్ అడ్రస్, 4132 తప్పుడు ఫొటోలు ఉన్న ఓటర్లు, మరో 33,692 ఓటర్లు ఫారం6 దుర్వినియోగం చేశారు'' అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**స్పందించిన ఎన్నికల సంఘం..**

కర్ణాటకలో ఓటర్ల జాబితా విషయంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఆ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (CEO) కార్యాలయం స్పందించింది. ''ఓటర్ల జాబితాలో అనర్హులను చేర్చారని, అర్హులైన ఓటర్లను మినహాయించారని ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో.. సంబంధిత ఓటర్ల వివరాలు డిక్లరేషన్ రూపంలో అందజేయండి. తద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటాం'' అని రాహుల్ గాంధీకి ఓ లేఖ రాసింది.

## అమెరికాపైనా ప్రతీకార సుంకాలు విధించాలి: శశిథరూర్

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు మనపై కచ్చితంగా ప్రభావం చూపిస్తాయన్నారు. దాదాపు 90 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. సుంకం ఎక్కువగా ఉన్నప్పుడు భారత్ వస్తువులు ఎందుకు కొనాలి అని కొనుగోలుదారులు కూడా ఆలోచిస్తారన్నారు. రష్యా నుంచి భారత్ కంటే చైనా ఎక్కువ చమురు కొనుగోలు చేస్తోందని..



కానీ, ఆ దేశానికి ట్రంప్ సుంకాల నుంచి 90 రోజుల ఉపశమనం కల్పించారన్నారు. మనకు మాత్రం మూడు వారాలే ఉపశమనం కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్రం కూడా యూఎస్ దిగుమతులపై 50శాతం సుంకం విధించాలని కోరారు. మరే దేశం కూడా మనపై ఇలా బెదిరింపులకు దిగకూడదన్నారు. ఇప్పటికే భారత్‌పై 25శాతం సుంకాలు విధించిన ట్రంప్ దాన్ని 50శాతానికి పెంచారు. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్తగా విధించిన 25శాతం టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై ఇది వెంటనే ప్రభావం చూపనుంది. ట్రంప్ విధించిన సుంకాలపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# మెడికల్ కాలేజీలో గంజాయి కలకలం.. 9 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్

హైదరాబాద్: నగరంలోని మెడిసిటీ మెడికల్ కాలేజీలో గంజాయి కలకలం రేపింది. 'ఈగల్' పోలీసులు నిర్వహిస్తోన్న ఆపరేషన్‌లో కాలేజీకి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న 82 మంది వినియోగదారులను పోలీసులు గుర్తించారు. వారిలో 32 మంది మెడిసిటీ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఉన్నట్లుగా



తేలింది. 24 మంది విద్యార్థులకు డ్రగ్స్ టెస్టు చేయగా.. 9 మందికి పాజిటివ్ వచ్చింది. వీరిలో ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. వీరంతా హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. దీంతో ఈగల్ పోలీసులు, మెడిసిటీ కాలేజీ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రగ్స్ వాడినట్లు తేలిన 9 మంది విద్యార్థులను డీఅడిక్షన్ సెంటర్‌కు పంపించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు విద్యాసంస్థల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని ఈగల్ అధికారులు వెల్లడించారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన జరీనా బాను, అరఫాత్ అహ్మద్‌ఖాన్ గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి పలువురు పెడ్లర్లతో సరఫరా చేయిస్తున్నారు. నిందితుల బ్యాంక్ ఖాతాలు పరిశీలించగా.. రూ.1.5కోట్ల అనుమానాస్పద లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. అందులో రూ.26లక్షలు హైదరాబాద్‌కు చెందిన 51 మంది పెడ్లర్లు, మిగిలిన నగదు.. దాదాపు 100 మంది మధ్య లావాదేవీలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆ వంద మందిలో ఈ 32 మంది మెడికల్ విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.

## 2 లక్షల పింఛన్లు రద్దు చేశారు

**: మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2 లక్షల పింఛన్లను రద్దు చేసిందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. పింఛను మొత్తం రూ.4వేలకు పెంచుతామని ఇంకా పెంచలేదని ఆయన విమర్శించారు. చంద్రబాబుకు గురుదక్షిణగా గోదావరి జలాలను తరలిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కన్నేపల్లి పంపులను ఆన్‌చేస్తే అన్ని ప్రాజెక్టులు నిండుతాయన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా చేస్తే కేసులు పెట్టారన్నారు.



## రెండున్నరేళ్లలో అధికారంలోకి వస్తాం.. అందరి లెక్కలు సరిచేస్తాం

హైదరాబాద్: రెండున్నరేళ్లలో భారత రాష్ట్రసమితి (BRS) పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కేసీఆర్ పాలనలో అందరికీ న్యాయం జరిగింది. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి విచిత్రంగా ఉంది. భూములు విలువలు పడిపోయాయి. యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోంది. పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారు. ఐఏఎస్‌లు రాజకీయాలు మాట్లాడటం సరికాదు. రుణమాఫీ



విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కాంగ్రెస్‌పై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఓట్లు ఉన్నప్పుడు కాదు.. నాట్లు వేసేటప్పుడు రైతుబంధు ఇవ్వాలి. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం రైతుబంధు నిలిపివేస్తుంది. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు పెట్టి బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టాలి. రేవంత్‌రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టుకుంది. అందుకే దిల్లీలో కూడా ఆయన్నే విమర్శిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి పాలనలో జరిగిన మంచి పనులు కార్యకర్తలు చెప్పలేకపోయారు.. అందుకే ఓడిపోయాం. కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలి"అని కేటీఆర్ అన్నారు.

## కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలు సాగనివ్వం: మంత్రి పొన్నం



ఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధేయ పద్ధతిలో పోరాడి అనుకున్నది సాధిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా.. గెలిచిందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లో బీసీలు ఆ పార్టీని తిరస్కరించారని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే వచ్చే ఎన్నికల్లో భాజపా ఓటమి ఖాయమని పేర్కొన్నారు. "శాసనసభలో బీసీ బిల్లుపై తీర్మానం సందర్భంలో కిషన్‌రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పిఉంటే ఆరోజే చర్చ జరిగేది. కానీ ఆ బిల్లు చట్టం రూపంలో మారి గవర్నర్ ఆమోదంతో దిల్లీకి వచ్చిన తర్వాత మీరు ముస్లింల పేరుతో ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదు. మిమ్మల్ని బహిరంగ చర్చకు కూడా ఆహ్వానించదల్చుకున్నా. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి జంతర్ మంతర్ ధర్నా వరకు మేం బాధ్యతగా ఉన్నాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## హైదరాబాద్‌లో 11.5 కేజీల గంజాయి పట్టివేత

హైదరాబాద్: తీగ లాగితే డొంకంతా కదిలినట్లు.. నగరంలోని చైతన్యపురిలో ఓ వ్యక్తి వద్ద గంజాయి లభించడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. వాటిని విక్రయిస్తున్న వ్యక్తులు చిక్కారు. వారి నుంచి 11.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురిలో భూక్య శ్రీకాంత్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి 340 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అది ఎక్కడ నుంచి వచ్చిందని అతడిని ప్రశ్నించినప్పుడు అబ్బాస్ అనే వ్యక్తి వద్ద నుంచి తీసుకొచ్చానని నిందితుడు చెప్పాడు. అతడు ఇచ్చిన సమాచారంతో అతడి ఇంటికి వెళ్తే 850గ్రాముల గంజాయి లభించింది. పోలీసులు అతడిని కూడా అరెస్టు చేసి విచారించారు. రెండో నిందితుడిని ఆరా తీయగా.. నడిమింటి మమత



అనే మహిళ ఇంట్లో 10.693 కిలోల గంజాయి పట్టుబడింది. వీటి విలువ రూ.6లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ రెండు కేసుల్లో నలుగురిపై కేసు నమోదు చేశామని, ముగ్గురిని అరెస్టు చేయగా.. ఒకరు పరారీలో ఉన్నారని చెప్పారు.

## గచ్చిబౌలిలో హెరాయిన్ స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు

హైదరాబాద్: నగరంలోని గచ్చిబౌలి పరిధి ఖాజాగూడలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు హెరాయిన్‌ను పట్టుకున్నారు ఇద్దరు నిందితుల నుంచి అధికారులు 66 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బంగాల్ రాష్ట్రం మాల్దా ప్రాంతానికి చెందిన ఎండీ నూర్ అఖ్తర్(28), అజాత్ మెమిన్(32)గా గుర్తించారు. వీరు బంగాల్ నుంచి మాదకద్రవ్యాలను తెచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని శేరిలింగంపల్లి ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.




## అడ్డదారుల్లో ఉద్యోగాలు రావు..
## 3038 పోస్టుల భర్తీకి కసరత్తు మొదలైంది: సజ్జనార్

హైదరాబాద్: టీజీఎస్‌ఆర్టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఉద్యోగార్థుల్ని కొందరు మోసం చేస్తున్నట్లుగా యాజమాన్యం దృష్టికి వచ్చిందని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి మేరకు తమ సంస్థ(TGS RTC)లో 3038 పోస్టుల భర్తీకి సంబంధించిన కసరత్తు మొదలైనట్లు ప్రకటించారు. ఈ పోస్టులకు ప్రభుత్వ నియామక బోర్డుల ద్వారా నోటిఫికేషన్ త్వరలోనే వెలువడనుందన్నారు. ఈ నియామక ప్రక్రియ మెరిట్ ఆధారంగా



పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. "అడ్డదారుల్లో ఎవరికీ కూడా ఉద్యోగాలు రావు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురిచేసి డబ్బులు వసూలు చేసే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఉద్యోగార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఆర్టీసీలో ఉద్యోగాల పేరిట ఎవరైనా మిమ్మల్ని సంప్రదిస్తే వెంటనే యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సంస్థ సూచిస్తోంది" అని పేర్కొన్నారు.

## భారత రాష్ట్రసమితి బీసీ గర్జన సభ వాయిదా




హైదరాబాద్: శుక్రవారం జరగాల్సిన భారత రాష్ట్ర సమితి బీసీ గర్జన సభను వాయిదా చేశారు. ఈ నెల 14న కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. వర్షాల కారణంగా ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు.

## హైదరాబాద్‌కు క్లౌడ్ బరస్ట్ హెచ్చరిక

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ సిటీలో పెనుగాలులతో కుండపోతగా వర్షం కురుస్తోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, హిమాయత్‌నగర్, లక్డీకపూల్, నాంపల్లి సహా పలు ప్రాంతాల్లో, పంజాగుట్ట, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, మాదపూర్, కొండాపూర్, బయోడైవర్సిటీ, ఐకియా సెంటర్, ఏఎంబీ, ఇనార్బిట్ మాల్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, హైటెక్‌సిటీలో వర్షం దంచికొడుతోంది. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు.. హైదరాబాద్‌కు వాతావరణ శాఖ మరో కీలక హెచ్చరిక చేసింది. హైదరాబాద్‌కు



క్లౌడ్ బరస్ట్ ముప్పు పొంచి ఉందని అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావొద్దని హెచ్చరించింది.

## ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో అమిటి యూనివర్సిటీ చాన్సలర్ భేటీ.. ఎందుకంటే?



తెలంగాణలో విద్యారంగం అభివృద్ధికి తమ వంతుగా సేవలు అందిస్తామని అమిటీ యూనివర్సిటీ చాన్సలర్ అతుల్ చౌహాన్ తెలిపారు. గురువారం ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణలో తమ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసినందుకు సీఎంకు అతుల్ చౌహాన్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో తాము ఒప్పందం చేసుకుంటామని, కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని చౌహాన్ చెప్పారు. మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యాబోధనతో ఇప్పటికే అమిటీకి మంచి పేరు ఉందని, తెలంగాణలో మరింతగా రాణించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమిటీ యూనివర్సిటీ ప్రతినిధి రామచంద్రం పాల్గొన్నారు.

## మేడారం మాస్టర్ ప్లాన్.. కేంద్ర మంత్రి షెకావత్‌తో మంత్రి సీతక్క భేటీ

తెలంగాణ మంత్రులు ఢిల్లీ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గురువారం కేంద్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క భేటీ అయ్యారు. ములుగు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న విస్తృత అవకాశాలను కేంద్ర మంత్రికి సీతక్క వివరించారు. ములుగు జిల్లాలో పర్యటక అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలని వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మేడారం మాస్టర్ ప్లాన్ పనుల కోసం రూ.25 కోట్లను



మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి సీతక్క కేంద్ర మంత్రిని కోరారు. అలాగే మంగపేట మండలం మల్లూరు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.25 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించారని కేంద్ర మంత్రి షెకావత్‌కు సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

## వరుసగా ఐదో ఏడాదీ.. జీతం తీసుకోని ముకేశ్ అంబానీ



**ముంబై:** ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 2025 ఆర్థిక సంవత్సరంలోనూ జీతం తీసుకోలేదు. తాజాగా సంస్థ విడుదల చేసిన వార్షిక నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇలా ముకేశ్ అంబానీ జీతం తీసుకోకపోవడం వరుసగా ఇది ఐదో ఏడాది కావడం విశేషం.

కరోనా, ఆర్థిక రంగం ఢీలా పడటంతో 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ముకేశ్ అంబానీ జీతం తీసుకోకుండా పనిచేస్తున్న విషయం తెలిసిందే. అయితే అంతకుముందు మాత్రం 2008-09 నుంచి 2019-20 వరకు ఏటా రూ.15 కోట్లు తీసుకుంటూ వచ్చారు. కానీ కరోనా నేపథ్యంలో 2020-21 నుంచి జీతాన్ని తీసుకోబోనని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పటికీ అదే నిర్ణయానికి కట్టుబడి వరుసగా ఐదో ఏడాది కూడా జీతం తీసుకోలేదు. ఇక ముకేశ్ అంబానీ 103.3 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలోనే 18వ కుబేరుడిగా కొనసాగుతున్నారు.

మరోవైపు ముకేశ్ అంబానీ ముగ్గురు పిల్లలు ఇషా అంబానీ పిరమల్, ఆకాష్ అంబానీ, అనంత్ అంబానీలు 2023 అక్టోబర్‌లో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా బోర్డులో చేరిన విషయం తెలిసిందే. వారు కూడా జీతాలు తీసుకోవడం లేదు. బోర్డు సమావేశాలకు హాజరైనప్పుడు ఫీజులు మాత్రం చెల్లిస్తారు. అలాగే సంస్థ లాభాలపై కమీషన్‌నూ తీసుకుంటారు. వారు 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కొక్కరు సిట్టింగ్ ఫీజుగా రూ.6 లక్షలు, కమీషన్‌గా రూ.2.25 కోట్లు అందుకున్నారు. అంతకు ముందు ఏడాది 2024 ఆర్థిక సంవత్సరంలో వారు ఒక్కొక్కరు రూ.కోటి కమీషన్ పొందారు.

ఇక ముకేశ్ అంబానీ బంధువులైన నిఖిల్, హితల్ మేస్వానీ 2025 ఆర్థిక సంవత్సరంలో ఒక్కొక్కరు రూ.25 కోట్లు అందుకున్నారు. అందులో రూ.7.28 కోట్లు జీతం, ప్రోత్సాహకాలు కాగా, రూ.44 లక్షలు రిటైరల్ బెనిఫిట్స్, రూ.17.28 కోట్లు కమీషన్‌గా అందుకున్నారు. ఇక ఆగస్టు 2023లో బోర్డు నుంచి వైదొలిగిన నీతా అంబానీకి సంబంధించిన వివరాలు 2025 ఆర్థిక సంవత్సరంలో కనిపించలేదు. అంతకు ముందు ఏడాది నీతా సిట్టింగ్ ఫీజుగా రూ.2 లక్షలు, రూ.97 లక్షలు కమీషన్‌గా అందుకున్నారు. ఇక 2022-23కుగాను నీతా అంబానీ రూ.6 లక్షల ఫీజు, రూ.2 కోట్ల కమీషన్‌గా పొందారు.

## ఉద్యోగులకు టీసీఎస్ తీపి కబురు..

**80 శాతం ఉద్యోగుల వేతనాలు పెంపు**




**న్యూఢిల్లీ:** పెద్ద ఎత్తున ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించి షాకిచ్చిన భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇప్పుడు తీపి కబురు చెప్పింది. దాదాపు 80 శాతం ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది. టీసీఎస్ తాజా నిర్ణయంతో జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. సెప్టెంబర్ 1 నుంచి వేతన పెంపులను అమలు చేయనున్నట్లు ఉద్యోగులకు పంపిన ఈ మెయిల్‌లో టీసీఎస్ సీహెచ్ఆర్‌వో మిలింద్ లక్కడ్ తెలిపారు.

కాగా, ఇటీవలే టీసీఎస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. లేఆఫ్స్ ప్రకటన వేళ కంపెనీ జీతాల పెంపు నిర్ణయం ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశమనే చెప్పాలి.

## నష్టాలలో భారత స్టాక్ మార్కెట్లు..

**అమెరికా టారిఫ్‌లే కారణం**

**భారీ నష్టాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు**

**నష్టాల్లో అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా వంటి షేర్లు**

**లాభాల్లో ట్రెంట్, టైటాన్, సన్‌ఫార్మా, ఐటీసీ**

**లాభాలతో ముగిసిన అమెరికా మార్కెట్లు**



**ముంబై:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై 25 శాతం అదనపు సుంకం విధించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. రష్యా నుంచి భారతదేశం చమురు దిగుమతులు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మొత్తం టారిఫ్ 50 శాతానికి చేరింది.

ఈ ప్రభావంతో ముఖ్యంగా వస్త్రాలు, సముద్ర ఉత్పత్తులు, తోలు వంటి ఎగుమతి రంగాలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. భారతదేశం ఈ చర్యను 'అన్యాయం, అసంబద్ధం' అని ఖండించింది. రష్యా చమురు దిగుమతుల కారణంగా అమెరికా నుంచి 50 శాతం టారిఫ్ ఎదుర్కొంటున్న దేశాల్లో బ్రెజిల్ తర్వాత భారతదేశం రెండోది.

ఉదయం ట్రేడింగ్‌లో 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 335.71 పాయింట్లు పడిపోయి 80,208.28 వద్ద, 50 షేర్ల ఎన్ఎస్ఈ నిఫ్టీ 114.15 పాయింట్లు తగ్గి 24,460.05 వద్ద ట్రేడ్ అయ్యాయి. సెన్సెక్స్‌లోని అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎటర్నల్, టాటా స్టీల్, ఎన్‌టీపీసీ వంటి సంస్థలు నష్టాల్లో ఉన్నాయి. అయితే, ట్రెంట్, టైటాన్, సన్ ఫార్మా, ఐటీసీ వంటి షేర్లు లాభాలను నమోదు చేశాయి. ఆసియా మార్కెట్లలో మాత్రం దక్షిణ కొరియా కొస్పి, జపాన్ నిక్కీ 225, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ సూచీలు సానుకూలంగా కొనసాగాయి.

బుధవారం అమెరికా మార్కెట్లు లాభాలతో ముగిశాయి. అయితే, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐఎస్) బుధవారం రూ. 4,999.10 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు ఒక శాతం పెరిగి 67.56 డాలర్లకు చేరుకుంది. బుధవారం సెన్సెక్స్ 166.26 పాయింట్లు పడిపోయి 80,543.99 వద్ద, నిఫ్టీ 75.35 పాయింట్లు తగ్గి 24,574.20 వద్ద ముగిశాయి.

# గిల్ చేతికి దేశవాళీ జట్టు పగ్గాలు..

## అదే ఉత్సాహంతో కప్ అందిస్తాడా!




**న్యూఢిల్లీ:** సీనియర్లు లేకుంటేనేం ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ సమం చేసిన శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా నూరు మార్కులు కొట్టేశాడు. నాయకుడిగా ముందుండి నడిపిస్తూ.. తనకిచ్చిన స్క్వాడ్‌ను సమర్ధంగా ఉపయోగించుకొని 'మిస్టర్ పర్ఫెక్ట్' అనిపించుకున్నాడు. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీని పంచుకున్న ఉత్సాహంతో స్వదేశం వచ్చిన గిల్‌కు మళ్లీ కెప్టెన్ బాధ్యతలు అందుకున్నాడు.

దేశవాళీ సీజన్‌లో అతడు నార్త్ జోన్ సారథిగా ఎంపికయ్యాడు. దులీప్ ట్రోఫీ కోసం గురువారం సెలెక్టర్లు గిల్ నాయకత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ప్రకటించారు. ఆగస్టు నెలాఖర్లో దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుంది. జోన్ల ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో గిల్ కెప్టెన్సీలో నార్త్ జోన్ టైటిల్ వేటకు సిద్ధమవుతోంది. సెలెక్టర్లు ఎంపిక చేసిన స్క్వాడ్‌లో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలతో పేస్ దళం పటిష్టంగా ఉంది. ఒకవేళ ఈ గిల్ ఆసియా కప్ ఆడాల్సి వస్తే శుభం రొహిల్లా నార్త్ జోన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సెలెక్టర్లు తెలిపారు.

**నార్త్ జోన్ స్క్వాడ్:** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), శుభం ఖజురియా, అంకిత్ కుమార్ (వైస్ కెప్టెన్), ఆయుష్ బదొని, యశ్ దయాల్, అంకిత్ కల్సి, నిశాంత్ సింధు, సాహిల్ లొత్రా, మయాంక్ దగర్, యధ్‌వీర్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, అన్షుల్ కంభోజ్, అఖీబ్ నబీ, కన్హయ్య వధావన్ (వికెట్ కీపర్).

**రీప్లేస్‌మెంట్స్:** ఒకవేళ గిల్, అర్ష్‌దీప్, హర్షిత్‌లు ఆసియాకప్ స్క్వాడ్‌కు ఎంపికైతే వీళ్ల స్థానాన్ని భర్తీ చేసేందుకు ముగ్గురిని ఎంపిక చేశారు సెలెక్టర్లు. శుభం రొహిల్లా (గిల్), గుర్నూర్ (అర్ష్‌దీప్ సింగ్), అనుజ్ థక్రాల్ (హర్షిత్ రానా).

**స్టాండ్ బైస్:** శుభం అరోరా, జస్కరణ్‌వీర్ సింగ్, రవి చౌహన్, అబిడ్ ముస్తాక్, నిషంక్ బిర్లా, ఉమర్ నజీర్, దివేష్ శర్మ.

ఇంగ్లండ్ పర్యటనతో టెస్టు కెప్టెన్‌గా పగ్గాలు అందుకున్న గిల్ అంచనాలకు మించి రాణించాడు. సీనియర్లు లేనిలోటు కనిపించినా.. జట్టు ప్రదర్శన మాత్రం ఇసుమంతైనా తగ్గకుండా చూసుకున్నాడు. లీడ్స్‌లో ఓటమితో సిరీస్ ఆరంభించినా పట్టువదలక బర్మింగ్‌హమ్‌లో రికార్డు విజయంతో సిరీస్ సమం చేసింది గిల్ సేన. ఆ మ్యాచ్‌లో రెండు శతకాలతో చెలరేగాడు గిల్. అనంతరం లార్డ్స్‌లో అసమానంగా పోరాడినా 21 పరుగుల దూరంలో ఆగిపోయింది భారత్.

ఇక మాంచెస్టర్‌లో సున్నాకే రెండు వికెట్లు పడిన వేళ కెప్టెన్ గిల్ ఓపెనర్ కేఎల్ రాహుల్‌తో పాటు క్రీజులో పాతుకుపోయాడు. చివరిరోజు సుందర్, జడ్డూల శతకాలతో డ్రాగా ముగిసిందా టెస్టు. నిర్ణయాత్మక ఓవల్ టెస్టులో టీమిండియా యశస్వీ సెంచరీ.. సిరాజ్ సూపర్ స్పెల్ కారణంగా అద్భుత విజయంతో సిరీస్ సమం చేసింది. ఎన్నో అనుమానాల నడుమ జట్టును గొప్పగా నడిపించిన గిల్ బ్యాటర్‌గా 754 రన్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ పట్టేశాడు.

## ఎప్పటికీ ఎల్లో జెర్సీలోనే ఆడుతా




ఎంఎస్ ధోనీ

**చెన్నై:** చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్ ఎంఎస్ ధోనీ ఆ జట్టుతోనే భవిష్యత్తులో కొనసాగనున్నాడు. ఇటీవల జరిగిన ఓ ఈవెంట్‌లో అతను ఆ క్లారిటీ ఇచ్చాడు. 2008 నుంచి ఐపీఎల్‌లో చెన్నై టీమ్‌తోనే ధోనీ ఆడుతున్నాడు. అతని సారథ్యంలో ఆ జట్టు అయిదుసార్లు టైటిల్ కూడా నెగ్గింది. అయితే గత కొన్ని సీజన్ల నుంచి సీఎస్కే జట్టు సరిగా పర్ఫార్మ్ చేయడం లేదు. దీంతో ధోనీ కెప్టెన్సీ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. చివరి సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ .. సీఎస్కే కెప్టెన్‌గా బాధ్యలు చేపట్టాడు. ధోనీ కెరీర్ ముగిసిందా అన్న అనుమానాలకు అతనే తెరదింపాడు.

మళ్లీ పసుపు రంగు జెర్సీలోనే ఐపీఎల్ ఆడుతారా అని అడిగిన ప్రశ్నకు ఎంఎస్ ధోనీ సమాధానం ఇచ్చారు. తన నిర్ణయం తాను తీసుకునేందుకు చాలా సమయం ఉందని, ఎప్పుడూ ఎల్లో జెర్సీలోనే ఆడుతానన్నాడు. క్రికెట్ ఆడినా, ఆడకపోయినా.. తన జర్నీ ఎల్లో జెర్సీలోనే కొనసాగుతుందన్నాడు. నేను, సీఎస్కే ఒకే దగ్గర ఉన్నామన్నారు.

చెన్నై జట్టుతో రిలేషన్ పెరిగిందని, ఓ వ్యక్తిగా ఎదగడానికి ఆ అనుభం ఎంతో సహకరించిందని, క్రికెటర్‌గా చాలా ఇంప్రూవ్ అయ్యానని, చెన్నైకి ఇది మంచిదే అని, తనకు కూడా వ్యక్తిగతంగా మంచిదే అని ధోనీ పేర్కొన్నాడు. 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో చెన్నై జట్టు చివరి స్థానంలో నిలిచింది.

## హైదరాబాదీ బౌలర్ సిరాజ్‌ను ప్రశంసించిన ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ..!

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ క్రికెట్ మాజీ ఆల్‌రౌండ్ మొయిన్ అలీ టీమిండియా ఫాస్ బౌలర్ సిరాజ్‌ను ప్రశంసలతో ముంచెత్తాడు. సిరాజ్ ధైర్యం, ప్రతికూల పరిస్థితులకు తలవంచకుండా పోరాడే మనోబలం ఇతర బౌలర్లతో వేరు చేస్తుందని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచు టెస్ట్ సిరీస్‌లో సిరాజ్ 23 వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌ను 2-2తో డ్రా చేయడంలో కీలకపాత్ర పోషించాడు. జీఎఫ్ఎస్ డెవలప్‌మెంట్ విడుదల చేసిన ప్రకటనలో మోయిన్ అలీ.. 'సిరాజ్ ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో అద్భుత ప్రదర్శను చేశాడు. అతని శక్తి, ఆగ్రహం, స్థిరత్వం అద్భుతంగా ఉన్నాయి. భారత జట్టు మ్యాచ్ విన్నర్‌గా నిలిచాడు.బ్యాట్స్‌మెన్స్‌కు అతన్ని ఎదుర్కోవడం ఎల్లప్పుడూ సవాల్ ఉంటుంది. అతని బంతిని నియంత్రించగలిగే శక్తి

చాలా ఆసక్తికరమైన విషయం. అతనో ధైర్యవంతుడూ. ఎప్పుడూ దాన్ని వదిలిపెట్టడు. ఇదే అతన్ని ప్రత్యేకంగా చేస్తుంది. క్రెడిట్ మొత్తం అతనికే దక్కుతుంది' అని చెప్పుకొచ్చాడు. భారత జట్టు, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి స్టార్ బ్యాట్స్‌మెన్ లేకుండానే ఈ సారి ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లింది. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని యువ జట్టు అద్భుతంగా రాణించింది. ఈ టూర్ సిరాజ్ ప్రత్యేకంగా నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టులు ఆడిన హైదరాబాదీ ఫాస్ట్ బౌలర్ ఏకంగా 185.3 ఓవర్లు ఓవర్లు వేశాడు. మొత్తం 23 వికెట్లు పడగొట్టాడు. ఇందులో తొమ్మిది వికెట్లు చివరిదైన ఓవల్ టెస్టులో తీసినవే. ఓవల్ టెస్ట్‌లో సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేసి మ్యాచ్‌ను గెలిపించడంతో భారత్ సిరీస్‌ను 2-2తో డ్రా చేసింది.




# నొప్పితో ప్రాణం పోయినంత పనైంది..

**అయినా ఓడిపోవడం బాధగా ఉంది: క్రిస్ వోక్స్**

**ఇండియాతో చివరి టెస్టులో భుజం గాయంతో బ్యాటింగ్‌కు దిగిన వోక్స్**

**ఓటమి అంచున ఉన్న ఇంగ్లండ్‌ను గెలిపించేందుకు సాహసం**

**పరుగులు తీస్తున్నప్పుడు నొప్పితో విలవిల్లాడానన్న ఇంగ్లండ్ పేసర్**

**వంద పరుగులు చేయాల్సి ఉన్నా బరిలోకి దిగేవాడినని వెల్లడి**

**ఫలితం దక్కకపోవడం తీవ్రంగా నిరాశపరిచిందని ఆవేదన**



**న్యూఢిల్లీ:** భారత జట్టుతో జరిగిన ఉత్కంఠభరితమైన చివరి టెస్టులో భుజం నొప్పితోనే మైదానంలోకి బ్యాటింగ్ చేయడానికి రావడం వెనుక ఉన్న కారణాలను ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ క్రిస్ వోక్స్ తాజాగా వెల్లడించాడు. జట్టు కోసం తాను చేసిన సాహసాన్ని, ఆ సమయంలో అనుభవించిన తీవ్రమైన నొప్పిని గుర్తుచేసుకున్నాడు. ఓవల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో వోక్స్ చూపిన ధైర్యం క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఐదో టెస్టు మొదటి రోజే ఫీల్డింగ్ చేస్తుండగా క్రిస్ వోక్స్ భుజానికి తీవ్ర గాయమైంది. దీంతో అతను మ్యాచ్ మొత్తానికి దూరమైనట్లు ప్రకటించారు. అయితే, ఆఖరి రోజు ఇంగ్లండ్ విజయానికి 35 పరుగులు అవసరమైన దశలో, చేతిలో నాలుగు వికెట్లు ఉన్నాయి. కానీ, భారత బౌలర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ విజృంభించడంతో ఇంగ్లండ్ 9 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. సరిగ్గా ఆ సమయంలో చేతికి స్లింగ్ తగిలించుకుని వోక్స్ బ్యాటింగ్‌కు రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఆ క్షణాల గురించి వోక్స్ మాట్లాడుతూ, "ఆ మ్యాచ్‌లో మేము ఓడిపోవడం నన్ను తీవ్రంగా నిరాశపరిచింది. గెలిచి ఉంటే బాగుండేది. అయితే, జట్టు కష్టాల్లో ఉందప్పుడు. అందుకే, బ్యాటింగ్‌కు వెళ్లకూడదనే ఆలోచన నాకు ఒక్క క్షణం కూడా రాలేదు. ఒకవేళ 100 పరుగులు చేయాల్సి ఉన్నా నేను కచ్చితంగా బరిలోకి దిగేవాడిని. నా ధైర్యాన్ని చూసి కొందరు భారత ఆటగాళ్లు వచ్చి అభినందించడం సంతోషాన్నిచ్చింది. అయినా, నా స్థానంలో ఏ ఆటగాడు ఉన్నా ఇదే పని చేసేవాడు" అని తెలిపాడు.

గాయంతో పరుగులు తీయడం ఎంత కష్టంగా మారిందో వివరిస్తూ, "మొదటి పరుగు తీయడమే అత్యంత నరకంగా అనిపించింది. నొప్పిని తట్టుకోవడానికి కోడెయిన్ తీసుకున్నాను. అయినా చాలా బాధగా ఉంది. సహజంగానే చేయి కట్టుకుని ఉన్నా మామూలుగా పరిగెత్తేందుకు ప్రయత్నించాను. ఆ సమయంలో నా భుజం మళ్లీ ఊడిపోయిందేమోనని నిజంగా ఆందోళన చెందాను. అందుకే వెంటనే హెల్మెట్ తీసి, పంటితో గ్లోవ్ తొలగించి భుజాన్ని చెక్ చేసుకున్నాను" అని వోక్స్ ఆ భయానక అనుభవాన్ని పంచుకున్నాడు.

చివరికి ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఆరు పరుగుల తేడాతో ఓటమిపాలైంది. అయినప్పటికీ, జట్టు కోసం వోక్స్ చూపిన తెగువ క్రీడాభిమానుల హృదయాలను గెలుచుకుంది.

## గూస్‌బంప్స్ తెప్పిస్తోన్న
# కరవాలి గ్లింప్స్



**టాకీస్:** యాక్టర్‌గా, దర్శకుడిగా, రైటర్‌గా, నిర్మాతగా కన్నడ సినీ పరిశ్రమలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు రాజ్ బీ శెట్టి. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ నిర్మించిన సు ఫ్రమ్ సో ఇటీవలే విడుదలై బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ ఆగస్టు 8న తెలుగులో విడుదల కానుంది. కాగా రాజ్ బీ శెట్టి వన్ ఆఫ్ ది కీ రోల్‌లో నటిస్తోన్న చిత్రం కరవాలి. ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటిస్తున్నాడు.

గురుదత్ గనిజ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి రాజ్ బీ శెట్టి ఫస్ట్ లుక్‌తోపాటు గ్లింప్స్‌ను షేర్ చేశారు. రాజ్ బీ శెట్టి రెండు దున్నల మధ్య నిలబడి చేతిలో కాగడ పట్టుకుని కనిపిస్తున్నాడు. సినిమాలో గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయని గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ గురుదత్ గనిగ మాట్లాడుతూ.. కర్ణాటక తీరప్రాంతంలో కరవాలి సినిమాను షూట్ చేశామని.. మనుగడ, విధేయత, మనిషి స్వభావం వంటి అంశాల చుట్టూ సినిమా కథ ఉంటుందని చెప్పాడు. జంతువు  మానవుడు ట్యాగ్‌లైన్ ఉంటుందని చెప్పాడు. ఈ మూవీలో ప్రజ్వల్ దేవరాజ్, రాజ్ బీ శెట్టితోపాటు మిత్రా, రమేశ్, ఇందిరా సంపద ప్రధాన పాత్రల్లో నటించారని చెప్పారు. వీకే ఫిల్మ్ అసోసియేషన్, గనిగా ఫిల్మ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ మూవీ త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది.



# శ్రీలీలతో నిర్మాతలకు భరోసా
## హీరోయిన్‌గా, డ్యాన్సర్‌గా డ్యూయల్ రోల్

**టాకీస్:** శ్రీలీల ఉంటే ఇక ఆ సినిమాలో స్పెషల్ సాంగ్స్ కోసం మరో భామను వెతకాల్సిన పని లేదు. ఎందుకంటే హీరోయిన్ రోల్‌కే కాదు ఐటమ్ నెంబర్‌కు ఫర్ ఫెక్ట్ ఛాయిస్‌గా మారిపోయింది. డ్యూయెట్ సాంగైనా, ఊర మాస్ పాటైనా మేడమ్ రచ్చ రంబోలా చేయాల్సిందే. స్పెషల్ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్లకు నిర్మాతలు కోట్లు వెచ్చించి తెచ్చుకునే ఛాన్స్ లేకుండా కిసిక్ బ్యూటీ డ్యూయల్ రోల్ పోషించేస్తోంది. ధమాకాలో పల్సర్ బైక్, జింతాకా అంటూ మాసీ స్టెప్పులు మొదలెట్టిన దగ్గర నుండి డ్యాన్సింగ్ క్వీన్‌గా ముద్రపడిపోయింది శ్రీలీల. ఫీమేల్ లీడ్‌గా నటిస్తే మాస్ సాంగ్ కంపల్సరీ. ఇక ఐటమ్ నంబర్ కోసం మరో భామకు తెచ్చుకోనక్కర్లేదు. ఏ టు- జెడ్ ఫెర్మామెన్స్ ఇచ్చేస్తుంది కిస్సిక్ బ్యూటీ-. యూట్యూబ్‌ను షేక్ చేయాలంటే మిస్ లీల ఉంటే చాలనేంతలా ప్రొడ్యూసర్ల మైండ్లలో ఫిక్స్ అయ్యేలా చేసింది. సినిమాపై హైప్ రావాలా, అ-టె-న్షన్ కావాలా వైరల్ వయ్యారీతో డ్యాన్స్ చేస్తే పోలా అని భావిస్తున్నారు. గుంటూరు కారంలో కుర్చీ మడత పెట్టినా, జూనియర్‌లో వైరల్ వయ్యారీగా మారినా తాను హీరోయిన్ కాని పుష్ప2లో కూడా కిస్సిక్ బ్యూటీ-గా ర్యాంపేజ్ గ్లామర్ షోతో మాస్ మహారాణిగా మారిపోయింది. ఇటు- హీరోయిన్‌గా, ఇటు- ఐటమ్ గర్ల్ గా మూవీకి వన్ ఉమెన్ షోగా మేకోవరైంది శ్రీలీల. అంటే నిర్మాతలకు డబుల్ బోనాంజాలా మారిన మేడమ్.. నెక్ట్స్ రవితేజ మూవీ మాస్ జాతరలోనూ అటు- క్లాసీ లుక్, ఇటు- మాసీ సాంగ్స్‌లో గత్తర లేపడానికి రెడీ అయ్యింది. మరోసారి ఈ జోడీ బాక్సాఫీస్ దగ్గర ధమాకా హిట్ నమోదు చేస్తుందా ఎ÷-లాపుల్లో ఉన్న రవితేజ, శ్రీలీలకు కంబ్యాక్ మూవీగా మారుతుందో లేదో చూడాలి.

# విడాకుల ర్యూమర్స్‌ను తోసిపుచ్చిన సంగీత

**టాకీస్:** సీనియర్ నటి సంగీత, ఆమె భర్త, సింగర్ క్రిష్ విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో ఇటీవల వార్తలు వస్తున్న నేపథ్యంలో తాజాగా ఈ వార్తలపై నటి సంగీత స్పందించింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపింది. ఈ సందర్భంగా తన భర్త క్రిష్‌తో కలిసి దిగిన ఒక ఫొటోను సోషల్ మీడియా వేదిక పంచుకుంది. గతంలో సంగీత తన ఇన్‌స్టాగ్రామ్ బయోలో సంగీత క్రిష్ అని ఉన్న పేరును సంగీతగా మార్చడంతో వీరిద్దరూ విడిపోతున్నట్లు- పుకార్లు మొదలయ్యాయి. అయితే ఈ పుకార్లకు చెక్ పెడుతూ మేము బాగానే ఉన్నట్లు- సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. సినిమాల విషయానికి వస్తే.. ఆచర్య, మసూద, వారసుడు తదితర చిత్రాలతో ఇటీ-వల ప్రేక్షకులను అలరించింది ఈ భామ.



## 2028కి కూడా పుష్ప3 రావడం కష్టమే..



**టాకీస్:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, లెక్కల మాస్టారు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం పుష్ప. తొలి పార్ట్ 2021లో రిలీజైంది. ఏ మాత్రం అంచనాలు లేకుండా రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు రాబట్టింది. ఇందులోని పాటలు, డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్ లు పాన్ వరల్డ్ రేంజ్ లో ఫేమస్ కావడంతో పుష్ప2 చిత్రానికి క్రేజ్ పెరిగింది. ఇక ఈ మూవీ గత ఏడాది విడుదలై ఇండియన్ సినిమా బాక్సాఫీస్ రికార్డులు కొల్లగొట్టింది. ఏకంగా రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇక పుష్ప 2 సినిమా ఎండింగ్ లో పుష్ప 3 కూడా ఉంటుందని చిన్న హింట్ ఇచ్చారు మేకర్స్. 2028లో పుష్ప 3 సినిమాను విడుదల చేస్తామని రాబిన్ హుడ్ ప్రమోషన్లలో భాగంగా మైత్రి మూవీస్ నిర్మాత రవిశంకర్ చెప్పుకొచ్చారు.

అయితే బన్నీ, సుకుమార్ బిజీ షెడ్యూల్ చూస్తే పుష్ప 3 చిత్రం 2028కి రావడం డౌటే అనిపిస్తుంది. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పూర్తి కావాలంటే ఎలా లేదన్నా రెండేళ్లు పైన పడుతుంది. అట్లీ సినిమా పూర్తయ్యాక బన్నీ.. త్రివిక్రమ్‌తో ఓ ప్రాజెక్ట్ చేయనున్నాడు. ఈ చిత్రం చేస్తే పుష్ప 3 అనుకున్న టైమ్‌కి రావడం కష్టం. అట్లీ సినిమానే దాదాపు 2027 దాకా చేసేలా కనిపిస్తుంది. ఇక త్రివిక్రమ్ చిత్రం ఎంత లేదన్న ఏడాదిన్నర సమయం తీసుకుంటుంది. మరి పుష్ప 3 ఎప్పుడు సెట్స్ మీదకు వెళుతుంది, ఎప్పుడు పూర్తై థియేటర్స్‌లోకి వస్తుంది. చూస్తుంటే 2028 లో పుష్ప 3 సాధ్యం కాదు సరికదా అసలు అప్పటికి సెట్స్ మీదకు వెళ్లడం గొప్పే అంటున్నారు.

అయితే పుష్ప2 భారీ విజయం సాధించిన నేపథ్యంలో పుష్ప 3 కోసం అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పుష్ప రాజ్ మేనియాని మరోసారి తెర మీద చూసేందుకు ఫ్యాన్స్ ఉవ్విళ్లూరుతున్నారు. కాని బన్నీ కమిటైన సినిమాలని బట్టి చూస్తుంటే 2028లో పుష్ప3 రావడం కష్టమే అని తెలుస్తుంది. ఇక సుకుమార్ పుష్ప2 తర్వాత ఏ ప్రాజెక్ట్ స్టార్ట్ చేయలేదు. రామ్ చరణ్‌తో తన తదుపరి మూవీ చేయనున్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం చరణ్.. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది చేస్తున్నాడు. ఇది పూర్తయ్యాక సుకుమార్- రామ్ చరణ్ కాంబో ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది.

## 'అర్జున్ చక్రవర్తి' నుంచి తొలి పాట
# 'మేఘం వర్షించదా' విడుదల



**టాకీస్:** టాలీవుడ్ యువ నటుడు విజయ రామరాజు టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం'అర్జున్ చక్రవర్తి'. ఇప్పటికే పలు అంతర్జాతీయ చలనచిత్ర వేదికలలో 46కి పైగా అవార్డులు గెలుచుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ 'మేఘం వర్షించదా' అనే పాటను విడుదల చేశారు. విఘ్నేష్ బాస్కరన్ ఈ అందమైన ప్రేమ గీతాన్ని కంపోజ్ చేయగా.. విక్రాంత్ రుద్ర రాసిన సాహిత్యం మనసును హత్తుకునేలా ఉంది. కపిల్ కపిలన్, మీరా ప్రకాష్, సుజిత్ శ్రీధర్ తమ మ్యాజికల్ వాయిస్‌తో ఆకట్టుకున్నారు. ఈ పాటలో విజయరామరాజు, సిజా రోజ్ కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. అద్భుతమైన స్పోర్ట్స్ డ్రామాతో పాటు హార్ట్ టచింగ్ లవ్ స్టోరీతో 'అర్జున్ చక్రవర్తి' అలరించబోతుందని ఈ పాట తెలియజేస్తుంది. విజయ రామరాజు, సిజా రోజ్, హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి, దుర్గేష్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాకి శ్రీని గుబ్బల నిర్మాతగా, ఈడే కృష్ణ చైతన్య సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రానికి విఘ్నేష్ బాస్కరన్ సంగీతం అందించగా, జగదీష్ చీకాటి సినిమాటోగ్రఫీ, ప్రదీప్ నందన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. ఈ సినిమాకు కృష్ణకాంత్ సాహిత్యం, రవీంద్ర పుల్లె సంభాషణలు రాశారు. పూజిత తాడికొండ కాస్ట్యూమ్ డిజైనర్‌గా, విష్ణు వర్ధన్ కలర్స్ ని అందించారు. పబ్లిసిటీ డిజైన్ స్కేల్ టిల్ట్ స్టూడియోస్, విఎఫ్ఎక్స్ మ్యాడ్‌హౌస్ విఎఫ్ఎక్స్ చేయగా, తేజస్వి సజ్జా పిఆర్ఓ గా వ్యవహరించారు, హాష్‌ట్యాగ్ మీడియా మార్కెటింగ్ బాధ్యతలు చూసుకుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.